RNI NO: APTEL/25/A0108

# మహి న్యూస్

www.mahinewsindia.com

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 196 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజీలు : 8 వెల రూ. 2 శుక్రవారం -16 - అక్టోబర్ - 2026

Published From :YSR Kadapa circulated by Kurnool I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana



2లో

### అబ్దుల్ కలాంకు ఘన నివాళి: స్ఫూర్తి శిఖరమన్న చంద్రబాబు, ఆదర్శమన్న పవన్ కల్యాణ్

- మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా నివాళులు
- దేశ అణు, సాంకేతిక రంగాలకు కలాం దిశానిర్దేశం చేశారన్న చంద్రబాబు
- కలాం ఆశయాలను కొనసాగించడమే నిజమైన నివాళి అని పిలుపు

## సరస్ మేళా.. ప్రతి ఇంటి నుంచి మహిళా పారిశ్రామికవేత్త రావాలి

### డ్వాక్రా సంఘాలను పారిశ్రామికవేత్తలుగా మార్చడమే లక్ష్యమని వెల్లడి

- ★ త్వరలో డ్వాక్రా సంఘాల టర్నోవర్ రూ.10 లక్షల కోట్లు కావాలన్న సీఎం
- ★ విజయవాడలో జాతీయ సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి, సీఎం
- ★ మహిళాశక్తికి రాష్ట్రపతి ముర్ము స్ఫూర్తిదాయకమన్న చంద్రబాబు
- ★ గ్రామీణ ఉత్పత్తులకు జాతీయ గుర్తింపు తేవడమే మేళా ఉద్దేశం



అమరావతి: విజయవాడలోని పున్నమి ఘాట్‌లో 'జాతీయ సరస్ మేళా' వైభవంగా ప్రారంభమైంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ముఖ్యమంత్రి చంద్రబాబు కలిసి ఈ మేళాను లాంఛనంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా గ్రామీణ మహిళల నైపుణ్యానికి, వారి ఉత్పత్తులకు వేదికగా నిలిచే ఈ కార్యక్రమానికి కనకదుర్గమ్మ సన్నిధి, కృష్ణమ్మ తీరం వేదిక కావడం విశేషం. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ విజయవాడలో మిగతా 2 లో

### రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగింది

స్థానిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదల



2లో

- ఒకే దశలో పుర పోరు..
- 13 కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీలకు నోటిఫికేషన్
- 28న పోలింగ్.. 30న ఫలితాలు
- పరిషత్ ఎన్నికలకు నవంబరు 3న పోలింగ్, 5న ఫలితాలు
- పంచాయతీలకు మూడు విడతల్లో నవంబరు 26, 29, డిసెంబరు 2న పోలింగ్
- పోలింగ్ రోజే ఓట్ల లెక్కింపు
- ఫలితాలు ప్రకటించాక 60 రోజుల వరకు బ్యాలెట్ పత్రాలు భద్రం

### ఎస్‌బీఐ కీలక నిర్ణయం.. గృహ, వాహన రుణాలపై వడ్డీ పెంపు



2లో

- ఆర్‌బీఐ రెపో రేటు పెంపుతో పెరిగిన వడ్డీలు
- గృహ, వాహన రుణాల ఈఎంఐలపై భారం
- ఎంసీఎల్ఆర్‌ను 15 బేసిస్ పాయింట్ల మేర పెంపు
- అక్టోబర్ 15 నుంచి కొత్త రేట్లు అమల్లోకి



2లో

### ఇంటర్నెట్ నిలిపివేత: సుప్రీంకోర్టుకు కేంద్ర హోం సెక్రటరీ బేషరతు క్షమాపణ

- కోర్టు ధిక్కరణ కేసులో అఫిడవిట్ దాఖలు
- రైసీనా హిల్స్ పరిధిలో 24 గంటల పాటు సెల్యులర్ సేవలు నిలిపివేసినట్టు వెల్లడి
- సీఈసీ రాజీనామా కోరుతూ తలపెట్టిన ఆందోళనల నేపథ్యంలో ఈ నిర్ణయం
- ఆందోళనలకు అనుమతి నిరాకరించినట్టు తెలిపిన ఢిల్లీ పోలీస్ కమిషనర్



2లో

### లలితా త్రిపుర సుందరిగా బెజవాడ దుర్గమ్మ.. పోటెత్తిన భక్తులు

- అమ్మవారి దర్శనానికి తెల్లవారుజాము నుంచే పోటెత్తిన భక్తులు
- శ్రీచక్ర అధిష్టాన దేవతగా, మోక్ష ప్రదాయినిగా లలితా దేవికి పూజలు
- అమ్మవారిని దర్శించుకుని ఏర్పాట్లను ప్రశంసించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

## అలాంటి వాళ్లను కాల్చి చంపాలి.. ట్రంప్ సంచలన వ్యాఖ్యలు

### సైనిక రహస్యాలు లీక్ చేసేవారిని కాల్చి చంపాలన్న ట్రంప్

- ఇరాన్‌పై దాడి వివరాలు మీడియాకు లీకయ్యాయని ఆరోపణ
- లీకేజీతో సైనిక చర్య సమయం మార్చినట్లు వెల్లడి
- రెండు రోజుల తర్వాత దాడి నిర్వహించినట్లు ట్రంప్ ప్రకటన
- లీకేజీకి పాల్పడిన వ్యక్తి వివరాలు వెల్లడించని అధ్యక్షుడు



ఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మిగతా 2 లో

### 'రూ.3 వేల కోట్ల విదేశీ బొగ్గు స్కామ్ ఆపాలి'.. సీఎంకు కేటీఆర్ బహిరంగ లేఖ

"విదేశీ బొగ్గు దిగుమతి ముసుగులో భారీ స్కామ్‌కు కుట్ర జరుగుతోంది

- భోత్రా లాజిస్టిక్స్ అనే అనుమానాస్పద కంపెనీతో ముందే సీఎం చీకటి ఒప్పందం చేసుకున్నారు
- భోత్రా లాజిస్టిక్స్‌తో ప్రభుత్వం, సింగరేణి చేసుకున్న ఒప్పందాలను బయటపెట్టాలి



హైదరాబాద్: రూ.3 వేల కోట్ల విదేశీ బొగ్గు కుంభకోణం ఆపాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈమేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. మిగతా 2 లో



2లో

### పాకిస్థాన్‌లో తీవ్ర విషాదం.. స్కూల్ పైకప్పు కూలి 29 మంది మృతి

- పెషావర్‌లో కూలిన స్కూల్ పైకప్పు
- ఘటనలో 28 మంది చిన్నారులు, ఒక టీచర్ మృతి
- 40 మందికి పైగా విద్యార్థులకు తీవ్ర గాయాలు
- పాఠశాల యజమానిని అరెస్ట్ చేసిన పోలీసులు
- ఘటనపై దర్యాప్తునకు ఆదేశించిన అధికారులు

## సీఎం రేవంత్ ఆదేశాల అమలు.. విద్యుత్ శాఖలో ఉన్నతాధికారి సస్పెన్షన్

### యాదాద్రి థర్మల్ ప్లాంట్ చీఫ్ ఇంజినీర్ బి.సురేశ్ సస్పెన్షన్

- విధుల్లో నిర్లక్ష్యమే చర్యలకు కారణమని టీజీ జెన్‌కో ఉత్తర్వులు
- విద్యుదుత్పత్తి పెంపు పనుల్లో పర్యవేక్షణ లోపాలున్నట్లు ఆరోపణ
- విద్యుత్ కోతలపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి
- ఉన్నతాధికారులపైనా చర్యలు తప్పవని సీఎం హెచ్చరిక



హైదరాబాద్: తెలంగాణలో విద్యుత్ కోతలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన గంటల వ్యవధిలోనే ప్రభుత్వం చర్యలకు దిగింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) స్టేజ్-1 చీఫ్ ఇంజినీర్ బి. సురేశ్‌ను సస్పెండ్ చేసింది. టీజీ జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్.హరీశ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుదుత్పత్తి పెంపునకు ప్రాధాన్య పనుల ప్రణాళిక, పర్యవేక్షణ, అమలులో ఆయన తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మిగతా 2 లో



2లో

### కరెంట్ కోతలకు మీ వైఫల్యమే కారణం.. రేవంత్‌పై హరీశ్ రావు ఫైర్!

- బొగ్గు నిల్వలు, సమీక్షల్లో నిర్లక్ష్యం జరిగిందని విమర్శ
- ఎల్‌నినో హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపణ
- అధికారులపై నెపం నెడుతున్నారని సీఎం తీరుపై విమర్శ
- నిషేధిత భూముల వ్యవహారాన్నీ ప్రస్తావించిన హరీశ్ రావు
- ప్రజలు, అధికారులు సీఎం పదవికి ముప్పుగా మారొచ్చని హెచ్చరిక

## పరిగి మున్సిపల్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు..

### - పాల్గొన్న శ్రీమతి ఉమా రామ్మోహన్ రెడ్డి

### పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్, స్థానిక కాంగ్రెస్ మహిళా నాయకులతో కలిసి పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి సతీమణి ఉమా రామ్మోహన్ రెడ్డి గాంధీ విగ్రహం సర్కిల్లో మున్సిపల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడుకలో పాల్గొన్నారు



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పరిగి పట్టణంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి సతీమణి ఉమా రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమా రామ్మోహన్ రెడ్డి మహిళలతో కలిసి బతుకమ్మను పేర్చి, బతుకమ్మను భక్తిశ్రద్ధలతో పూజించి,సంప్రదాయ పద్ధతిలో బతుకమ్మ ఆడుతూ సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జీ వెంకట్ రాములు, పరిగి అధ్యక్షుడు



గుండెల రామకృష్ణారెడ్డి, పరిగి పిఎసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, పరిగి పిఎసిఎస్ వైస్ చైర్మన్ బద్రి గారి రాజ పుల్లారెడ్డి, పరిగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయూబ్, స్థానిక కౌన్సిలర్లు అఖిల బాదాం శ్రీనివాస్ గుప్తా, యూసుఫ్, ఎజాజ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఆనం ఆంజనేయులు, పిఎసిఎస్ డైరెక్టర్ చిన్న నరసింహులు, శ్రీ అయ్యప్ప స్వామి శాశ్విత ధర్మకర్త,పాలాది శ్రీనివాస్ గుప్తా స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ సంబరాలను ఆనందోత్సాహాలతో నిర్వహించారు.

## పరిగి లో ఘనంగా మండల పార్టీ అధ్యక్షుడు జి వెంకటరాముల జన్మదిన వేడుకలు.....



వికారాబాద్ జిల్లా పరిగి (మహి న్యూస్): పరిగి మండల పార్టీ అధ్యక్షుడు జి వెంకట్ రాములు జన్మదిన వేడుకలను పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి నివాసంలో ఘనంగా జరుపుకున్నారు. మండల్ పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత నిరంతరం పార్టీ కోసం పని చేస్తూ పార్టీ ఐక్యతే ధ్యేయంగా అడుగులు వేస్తూ ముందుకు సాగుతున్న యువ నాయకుడు అని పలువురు కొనియాడారు. పార్టీ అధ్యక్షుడిగా సమర్థవంతంగా పరిగి మండలంలో పార్టీని ముందంజలో తీసుకువెళ్లేందుకు అందరితో కలిసి మెలిసి పనిచేస్తూ పార్టీ సంక్షేమ పథకాలు సైతం గ్రామ గ్రామానికి ఇంటింటికి అందే విధంగా కృషి చేస్తున్న మండల పార్టీ అధ్యక్షుడు జి వెంకట రాములు ఇటువంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ సందర్భంగా అన్నారు. నిరంతరం పార్టీ కోసం పనిచేసే నాయకులు చాలా అరుదుగా ఉంటారని ఈరోజు పరిగి



మండల పార్టీ అధ్యక్షుడిగా జి వెంకట రాములు బాధ్యతలు తీసుకున్న తర్వాత సమర్థవంతంగా పార్టీని ఐక్యంగా పటిష్టంగా ముందుకు నడుపుతారని భావించినట్లుగానే వాటిని గ్రామస్థాయిలో పటిష్టంగా పునర్నిర్మానం చేస్తూ ఎప్పటికప్పుడు ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకు వెళుతూ పార్టీని సమర్థవంతంగా ముందుకు నడుపుతున్న యువ నాయకుడు జి వెంకట రాములు పుట్టినరోజు ఈరోజు పరిగి మండల కాంగ్రెస్ పార్టీ పటిష్టమైన రోజుగా భావించవలసిన అవసరం ఎంతైనా ఉన్నదని పరిగి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పునరుద్ఘాటించి చెబుతున్నారు. పరిగి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పిఎసిఎస్ చైర్మన్ రాజ్ పుల్లారెడ్డి దగ్గరుండి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు

## భారత్, చైనాపై సుంకాల ముప్పు..
## 10 రోజుల్లో ట్రంప్ కీలక నిర్ణయం!

న్యూఢిల్లీ: రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేసే భారత్, చైనా సహా ఇతర దేశాలపై ఆంక్షలు విధించే అంశంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో 10 రోజుల్లో కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ వెల్లడించారు. ఈ చర్యల ద్వారా రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకడమే ట్రంప్ లక్ష్యమని తెలిపారు. బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో మాట్లాడిన గోర్.. రష్యా నుంచి ఇంధనం కొనుగోలు చేసే దేశాలపై జరిమానాలు, ఆంక్షలు విధించే అధికారం ట్రంప్‌కు కల్పించే బిల్లుకు అమెరికా సెనేట్‌లో 86 మంది సభ్యులు మద్దతు తెలిపినట్లు పేర్కొన్నారు. అయితే ఈ చర్యలు ఏ ఒక్క దేశాన్ని లక్ష్యంగా చేసుకుని తీసుకుంటున్నవి కావని ఆయన స్పష్టం చేశారు. భారత్‌కు మినహాయింపు ఇస్తారా?.. లేదా?.. అన్నది ట్రంప్ తీసుకునే నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని తెలిపారు.

### భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై ఆశాభావం

భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పంద చర్చలు పురోగతిలో ఉన్నాయని సెర్గియో గోర్ వెల్లడించారు. ఇప్పటికే పలు కీలక అంశాలపై అవగాహన కుదిరిందని, మిగిలిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాల్సి ఉందని చెప్పారు. రక్షణ, ఐటీ, డేటా సెంటర్లు, సెమీకండక్టర్లు, కృత్రిమ మేధ వంటి రంగాల్లో ఇరు దేశాల మధ్య సహకారాన్ని మరింత పెంచుకోవాలని అమెరికా భావిస్తోందని తెలిపారు. భారత్‌లో అమెరికా కంపెనీల పెట్టుబడులు పెరగడం ద్వారా ఇరు దేశాలకు ప్రయోజనం చేకూరుతుందని గోర్ పేర్కొన్నారు.

## రాహుల్ తీరుపై చీఫ్ జస్టిస్ ఆగ్రహం..
## వివరణ కోరుతూ నోటీసులు

న్యూఢిల్లీ : ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలను సవాలు చేస్తూ విపక్ష నేతలు దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు గురువారం విచారించింది. అయితే, ఈ పిటిషన్ల నేపథ్యంలో అక్టోబర్ 12న 'ఇండియా' కూటమితో కలిసి సుప్రీంకోర్టు వరకు రాహుల్ గాంధీ నిర్వహించిన నిరసన ర్యాలీ, కోర్టు ఆవరణలో జరిగిన ఆందోళనలపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. రాజకీయ కారణాలతో కోర్టు వద్ద చేపట్టిన ఈ ఆందోళనపై వివరణ ఇవ్వాల్సిందిగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. విచారణ సందర్భంగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాది గౌరవ్ భాటియా ఈ నిరసన తీరును తీవ్రంగా ఆక్షేపించారు. కోర్టు పరిధిలో ఉన్న అంశంపై బయట రాజకీయ ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని, కోర్టుపై ఒత్తిడి తెచ్చేందుకే ఇదంతా చేశారని వారు కోర్టు దృష్టికి తెచ్చారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ, 'న్యాయవ్యవస్థను ఎవరూ బెదిరించలేరు' అని తేల్చిచెప్పారు. కోర్టును ప్రభావితం చేసేందుకు జరిగే ఇలాంటి బలహీనమైన ప్రయత్నాలను ఎవరూ పట్టించుకోరని, తాము ప్రపంచానికి దూరంగా ఏకాంతంలో కూర్చోలేదని, చుట్టూ ఏం జరుగుతుందో తమకు పూర్తి అవగాహన ఉందని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. ఇదే క్రమంలో అక్టోబర్ 12న సుప్రీంకోర్టు ప్రాంగణంలో జరిగిన నిరసనకు సంబంధించిన పూర్తి సీసీటీవీ రికార్డింగులను భద్రపరచాలని న్యాయస్థానం ఆదేశించింది. ఎన్నికల సంఘం నిర్ణయాలపై దాఖలైన పిటిషన్లకు సంబంధించి కోర్టు నోటీసులు జారీ చేసినప్పటికీ, ఆ నిర్ణయం రాజకీయ నేతల తీరును సమర్థించినట్లు లేదా వారి ప్రవర్తనను క్షమించినట్లు కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ వ్యవహారంలో సంబంధిత పక్షాల స్పందన కోరుతూ తదుపరి విచారణను వాయిదా వేసింది.

# ఓ స్త్రీగా బతకడం కోసం...



తన అందచందాలు, డ్యాన్స్ విన్యాసాలతో ఐరోపా సమాజాన్ని ఉర్రూతలూగించిన ఒక నర్తకి... మొదటి ప్రపంచ యుద్ధ సంక్షోభంలో అంతర్జాతీయ గూఢచారిగా ముద్రపడి, తుపాకీ తూటాలకు బలైంది. ప్రపంచవ్యాప్తంగా 'మాతా హరి'గా ప్రసిద్ధి చెందిన ఆమె అసలు పేరు మార్గరీథా గీర్ట్రూయిడా జెల్లె. నెదర్లాండ్స్‌లోని లీవర్డెన్ నగరంలో 1876 ఆగస్టు 7న జన్మించిన ఈ డచ్‌మహిళ. మార్గరీథా జీవితం వెనుక అంతులేని విషాదం దాగి ఉంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆమె తల్లిదండ్రులు చిన్నపుడే విడిపోయారు. 14వ ఏట తల్లి క్షయవ్యాధికి గురై మరణించింది. పద్దెనిమిదేళ్ల వయసులో ఆమ్‌స్టర్‌డ్యామ్‌లోని కెప్టెన్ రుడాల్ఫ్ మెక్‌లియోడ్ అనే కరుడుగట్టిన సైనికుడిని 1895 జూలై 11న వివాహం చేసుకుకుంది. తరువాత ఇండోనేషియాలోని జావా, సుమత్రా దీవులకు భర్తతోపాటు వెళ్లింది. రుడాల్ఫ్ విపరీతమైన తాగుబోతు, తిరుగుబోతు, క్రూరుడు కూడా. అటువంటి అతడు ఆమెకు సిఫిలిస్ వ్యాధిని కూడా తగిలించాడు. ఫలితంగా ఆమె ఇద్దరు పిల్లలూ సిఫిలిస్ వ్యాధితోనే పుట్టారు. 1899 వేసవిలో విషపూరితమైన పాదరస చికిత్స కారణంగా రెండున్నరేళ్ల కుమారుడు నార్మన్ అనుమానాస్పద స్థితిలో మరణించాడు. ఈ విషాదంతో దాంపత్య బంధం పూర్తిగా విచ్ఛిన్నమైంది. అప్పటికే అప్పులపాలైన భర్త భరణాన్ని ఇవ్వడానికి నిరాకరించాడు. తీవ్రమైన పేదరికంలో కూరుకుపోయిన మార్గరీథా చివరకు బిడ్డను భర్త వద్దే వదిలేయాల్సి వచ్చింది.

### మాతా హరి అవతరణ

కుమార్తెను తిరిగి దక్కించుకోవడానికి తగినంత డబ్బు సంపాదించాలనే ఆశతో మార్గరీథా పారిస్ చేరుకుంది. ఈ దుర్భర పరిస్థితుల్లో ఆమె తన పాత గుర్తింపును సమాధి చేసి, సరికొత్త అవతారం ఎత్తాలని నిశ్చయించుకుంది. అలా పుట్టిందే 'మాతా హరి'. మలయ్ భాషలో మాతా హరి అంటే 'సూర్యుడు' లేదా 'పగటి కన్ను' అని అర్థం. తాను ఒక పవిత్ర భారతీయ ఆలయంలో జన్మించానని, అక్కడి పూజారిణుల వద్ద ప్రాచీన ఆలయ నృత్యాలు నేర్చు కున్నానని ఒక వింతైన కల్పిత గాథను సమాజంలో ప్రచారం చేసింది. 1905 మార్చి 13న పారిస్‌లోని మ్యూసీ గుయిమెట్‌లో ఆమె తొలిసారిగా బహిరంగ ప్రదర్శన ఇచ్చింది. జావా, సుమత్రాలలో గమనించిన సంప్రదాయ నృత్యాల ఆధారంగా ఒంటిపై దుస్తులను నెమ్మదిగా తొలగిస్తూ చేసిన ప్రదర్శనలు పారిస్ సమాజంలో పెను ప్రకంపనలు సృష్టించాయి. పదేళ్లపాటు ఐరోపా విలాస సమాజంలో తిరుగులేని తారగా వెలిగింది. కాలం గడిచేకొద్దీ నృత్యాలకు ఆదరణ తగ్గింది. సరిగ్గా అదే సమయంలో మొదటి ప్రపంచ యుద్ధం వచ్చింది. 1915 చివరలో ది హేగ్‌లో ఉన్నప్పుడు, ఒక జర్మన్ కాన్సుల్ ఆమె ఫ్రాన్స్ పర్యటనలో సమాచారం సేకరించి ఇస్తే భారీగా డబ్బు ఇస్తానని ఆశ చూపించాడు. ప్రమాదకరం కాని పాతబడిన సమాచారం అందించి ఆమె జర్మన్స్ నుంచి డబ్బు తీసుకుంది. మరోవైపు, ఫ్రెంచ్ ఇంటెలిజెన్స్ కోసం గూఢచారిగా పనిచేయడానికి కూడా ఆమె సిద్ధపడింది. ఆమె ద్వంద్వ వైఖరిపై అనుమానం పెంచుకున్న ఫ్రెంచ్ నిఘా వర్గాలు ఆమెను వెంబడించాయి. 1917 ఫిబ్రవరి 13న పారిస్‌నగరంలో ఫ్రెంచ్‌నిఘా వర్గాలు మాతా హరిని బంధించి, సెయింట్ లాజారే జైలులో నిర్బంధించాయి. అదే ఏడాది జూలై 24--25 తేదీల్లో సైనిక న్యాయస్థానంలో రహస్య విచారణ సాగింది. సొంత అసమర్థతను, వ్యూహాత్మక లోపాలను కప్పిపుచ్చుకోవడానికి ఫ్రెంచ్‌సైనిక నాయకత్వానికి ప్రజల దృష్టిని మళ్లించే ఒక ఆకర్షణీయమైన బలిపశువు అవసరమైంది. అందుకే సైనిక న్యాయస్థానం ఆమెకు మరణశిక్ష ఖరారు చేసింది. 1917 అక్టోబర్ 15 తెల్లవారుజామున మాతా హరిని విన్సెన్స్ సైనిక స్థావరానికి తరలించారు. చట్ట ప్రకారం కళ్లకు గంతలు కట్టుకోవాలని అధికారులు కోరినప్పుడు, ఆమె నిరాకరించింది. మృత్యువును కళ్లలోకి చూస్తూ నిటారుగా నిలబడింది. సైనికులు పేల్చిన తూటాలు ఆమె ఛాతీని చీల్చివేశాయి. కాలం గడిచేకొద్దీ అసలు నిజాలు బయటపడ్డాయి. 1930 లోనే జర్మన్ ప్రభుత్వం మాతా హరి తమ గూఢచారి కాదని స్పష్టంగా ప్రకటించింది. 2017లో ఫ్రాన్స్ స్వయంగా విడుదల చేసిన డాక్యుమెంట్లు ఆమె ఫ్రెంచ్ వైఫల్యాలకు బలైన అమాయకురాలని రూఢీ చేశాయి. దీంతో ఆమె కేవలం యుద్ధోన్మాద సైనిక వ్యవస్థ తన వైఫల్యాలను దాచుకోవడానికి బలిపీఠం ఎక్కించిన ఒక దయనీయమైన బలిపశువు మాత్రమే అని తేలింది.

# ఆగ్రహించిన ఫ్రాన్స్ విద్యార్థి!

మరో ఆర్నెల్లలో ఫ్రాన్స్ అధ్యక్ష పదవికి ఎన్నికలు జరగనున్న తరుణంలో ఆ దేశం హైస్కూల్ విద్యార్థుల ఆందోళనలతో అట్టుడుకుతోంది. రాజధాని పారిస్‌లో గత నెల 18న రాజుకున్న ఆందోళన విస్తరించటానికి ఎంతోకాలం పట్టలేదు. వేలాదిమంది విద్యార్థులనూ, ఉపాధ్యాయులనూ అరెస్టు చేయగా... బాష్పవాయు గోళాలు, స్టన్ గ్రెనేడ్‌లు, రబ్బరు బుల్లెట్లు ప్రయోగించటంతో వందలాదిమంది పిల్లలు, ఉపాధ్యాయులు గాయపడ్డారు. ఉద్యమం వల్ల వేలాది పాఠశాలలు మూతబడ్డాయి. కొన్నిచోట్ల పాఠశాల భవనాలకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పెట్టగా, తమపై సాగిస్తున్న హింసను సమర్థించుకోవటానికి పోలీసులే ఆ పని చేస్తున్నారని ఉద్యమకారుల ఆరోపణ. ఎన్నికలు ముంగిట్లో పెట్టుకుని ఏ ప్రభుత్వమూ జనంతో తగాదా పడదు. కానీ అధ్యక్షుడు ఇమానియేల్ మాక్రాన్ ఇందుకు విరుద్ధం. వరసగా 2017, 2022 అధ్యక్ష ఎన్నికల్లో గెలుపొందిన ఆయన ఎటూ రాజ్యాంగ ప్రకారం మూడో దఫా పోటీ చేయడానికి లేదు. కనుకనే నిర్లిప్తతను ప్రదర్శిస్తున్నట్టు కనబడుతోంది. మన దేశంలో ఆమ్య్ర కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నాయకులు యూపీ, గుజరాత్, రాజస్తాన్, మహారాష్ట్ర తదితరచోట్ల బడుల్ని సందర్శించి పశువుల పాకల్లో తరగతులు నడవడం, టీచర్లు లేకపోవటం, శిథిలావస్థకు చేరుకున్న భవనాల్లో పిల్లలు బిక్కుబిక్కుమంటూ చదువుకోవడం వంటి దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో పెట్టారు. ఆ తర్వాత సీజేపీ నేతలపై దాడులు, అరెస్టులు మొదలయ్యాయి. ఎంతో అభివృద్ధి సాధించిందని అందరూ అనుకునే ఫ్రాన్స్‌లో సైతం బడులు ఇలాగే అఘోరించాయని వస్తున్న వార్తలు దిగ్భ్రాంతి కలిగిస్తున్నాయి. చాలా పాఠశాలలకు టీచర్ల కొరత. దీనికితోడు కూలిన గోడలు, విరిగిన కిటికీలు, లీకవుతున్న పైకప్పులు, సరిగా పనిచేయని హీటింగ్ వ్యవస్థలు వెక్కిరిస్తున్నాయి. తరగతి గదులు కిక్కిరిసిపోతున్నాయని, అందువల్ల టీచర్లు శ్రద్ధ పెట్టలేకపోతున్నారని పిల్లల ఆరోపణ. ఫ్రాన్స్‌లో ప్రత్యేక శ్రద్ధ అవసరమైన ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి 12నుంచి 24మంది లోపు పిల్లలుండాలని, సాధారణ పాఠశాలల్లో ఈ సంఖ్య 22--26 మధ్య ఉండొచ్చని నిర్దేశించారు. చిత్రమేమంటే ఈసారి అధికారంలోకి రావాలని ఆరాటపడే లీపెన్ నేతృత్వంలోని అతి మితవాద పక్షం విద్యార్థుల్ని తప్పుబడుతోంది. పాలకులు నియంతలైనప్పుడు తిరగబడాలని ప్రపంచానికి బోధించింది ఫ్రాన్సే. రాజరికాన్నీ, భూస్వామ్య వ్యవస్థనూ సమాధి చేసిన బాస్టిల్ కోట ముట్టడి 1789



జూలై 14న పారిస్‌లో జరిగిన భారీ ర్యాలీ పర్యవసానమే. అంతవరకూ ప్రపంచ చరిత్రలో జనం ఇలా సామూహిక ప్రదర్శన నిర్వహించిన దాఖలా లేదు. 1968లో పతనమవుతున్న విద్యాప్రమాణాలనూ, ఉన్నత విద్యాసంస్థల్లో సదుపాయాల లేమినీ ప్రశ్నిస్తూ విద్యార్థులు భారీ ఉద్యమాన్ని నిర్వహించారు. డీజిల్ ధరలు పెంచే ప్రతిపాదనను నిరసిస్తూ 2018--2020 మధ్య జరిగిన 'యెల్లో వెస్ట్' ఉద్యమం సాగింది. ఈ ఉద్యమాల నుంచి ప్రస్తుత పాలకులు నేర్చుకున్నదేమీ లేదు. ఈయూ నుంచి బ్రిటన్ వైదొలగాక ఫ్రాన్స్ రెండో అతి పెద్ద ఆర్థికవ్యవస్థ. అయినా విద్యారంగం గుడ్లు తేలేస్తున్నది. అంతేకాదు... వైద్యం, పెన్షన్లు, ఇతర సామాజిక సేవా రంగాలూ నానాటికీ క్షీణిస్తున్నాయి. మరోపక్క రక్షణ రంగానికి కేటాయింపులు భారీగా పెరిగాయి. మాక్రాన్ తొలి ఏలుబడి నాటికి 3,500 కోట్ల డాలర్లుండే రక్షణ బడ్జెట్ ఇప్పుడు 7,100 కోట్ల డాలర్లు! రష్యాను 'ఎప్పటికైనా' జయించాలన్న తాపత్రయంతో నాటో భాగస్వామ్య దేశాలన్నిటికీ ఈ ఉన్మాదం పట్టుకుంది. ఫ్రాన్స్ అప్పు 3 లక్షల 60 వేల కోట్ల డాలర్ల పైమాటే. దాని జీడీపీలో ఇది 119 శాతం. బడ్జెట్ లోటు జీడీపీలో 5.4 శాతం. ఈయూ విధించిన పరిమితి కేవలం 3 శాతం. ప్రభుత్వం ఖర్చుల కోసం బాండ్లు వేలం వేస్తే కొనే నాథుడే లేడంటే పరిస్థితి ఎంత దిగజారిందో తెలుస్తుంది. ఫ్రాన్స్ వాలకంతో ఈయూ సభ్య దేశాలు లబోదిబోమంటున్నాయి. ఆ సంక్షోభం వల్ల యూరో విలువ పడిపోయి, ఆర్థిక వ్యవస్థలు దెబ్బతింటున్నాయని మొత్తుకుంటున్నాయి. అందుకే ఈ పార్లమెంటు సమావేశాల్లో 'కఠినమైన బడ్జెట్ కోతలు' విధించటానికి ప్రభుత్వం సిద్ధపడుతుండగా, ఈలోగా విద్యార్థి ఉద్యమం వచ్చిపడింది. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొనకపోతే ఈ సంక్షోభం మరింత విస్తరిస్తుంది.

# ఒక్క నెలలో 23 టన్నుల బంగారం కొనుగోలు.. డ్రాగన్ వ్యూహమిదే..

ప్రపంచ మార్కెట్లో బంగారం ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతున్న సమయంలో చైనా తన బంగారం కొనుగోళ్ల వేగాన్ని పెంచుతూ, వాటి నిల్వలను భారీగా పెంచుకుంటోంది. 2026 సెప్టెంబర్‌లో చైనా కేంద్ర బ్యాంకు ఏకంగా 23 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేసింది. అమెరికా డాలర్ బలపడటం, బాండ్లపై రాబడులు పెరగడం, వడ్డీ రేట్లు అధిక స్థాయిలో కొనసాగవచ్చనే అంచనాలతో ప్రపంచ మార్కెట్లో బంగారానికి ఆకర్షణ తగ్గినప్పటికీ.. చైనా మాత్రం తన వ్యూహాన్ని కొనసాగిస్తోంది. అసలు చైనా ఇంత భారీగా బంగారాన్ని ఎందుకు కొనుగోలు చేస్తోంది? దీని వెనుక ఉన్న ఆర్థిక వ్యూహం ఏమిటి?

ధరల పతనం.. చైనా కొనుగోళ్ల జోరు!

ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనా.. తన బంగారు నిల్వలను పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. చైనా పీపుల్స్ బ్యాంక్ (పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా-పీబీఓసీ) సెప్టెంబర్‌లో 7.40 లక్షల ఔన్సుల బంగారాన్ని కొనుగోలు చేసింది. ఇది సుమారు 23 టన్నులకు సమానం. దీంతో ఆ దేశ అధికారిక బంగారు నిల్వలు 7.747 కోట్ల ఔన్సులకు, అంటే సుమారు 2,410 టన్నులకు చేరాయి. అంతకుముందు ఆగస్టులో 6.50 లక్షల ఔన్సులు, జూలైలో 6.40 లక్షల ఔన్సుల బంగారాన్ని చైనా కొనుగోలు చేసింది. ఈ రెండు నెలలతో పోలిస్తే సెప్టెంబర్‌లో కొనుగోళ్లు పెరిగాయి. అంతేకాదు, చైనా కేంద్ర బ్యాంకు వరుసగా 23వ నెలలోనూ తన బంగారు నిల్వలను పెంచుకోవడం గమనార్హం. ఈ పరిణామం చూస్తే ధరల తగ్గుదల ఒక్కటే చైనా కొనుగోళ్లకు కారణం కాదని, దీర్ఘకాలిక నిల్వల నిర్వహణ ప్రణాళిక కూడా ఉండవచ్చని తెలుస్తోంది.

విదేశీ కరెన్సీపై ఆధారపడటం తగ్గించేందుకేనా..

చైనా ఈ విధంగా బంగారాన్ని భారీగా కొనుగోలు చేయడానికి ప్రధాన కారణాల్లో విదేశీ మారక నిల్వలను విభిన్న ఆస్తుల్లో పెట్టుబడి పెట్టడం ఒకటి కావచ్చని విశ్లేషణలు సూచిస్తున్నాయి. సాధారణంగా కేంద్ర బ్యాంకులు తమ నిల్వల్లో విదేశీ కరెన్సీలు, ప్రభుత్వ బాండ్లకు ప్రాధాన్యం ఇస్తాయి. అయితే, ఒకే కరెన్సీ లేదా ఒకే రకమైన ఆస్తిపై ఎక్కువగా ఆధారపడితే ఆర్థిక, మార్కెట్ పరమైన నష్టభయాలు పెరిగే అవకాశం ఉంటుంది. బంగారం విషయంలో ఈ పరిస్థితి భిన్నంగా ఉంటుంది. ఇది మరో దేశ ప్రభుత్వానికి సంబంధించిన రుణ బాధ్యత కాదు. అలాగే, ఒక నిర్దిష్ట కరెన్సీతో సమానమైన ఆస్తిగానూ పరిగణించలేం. అందువల్ల బంగారాన్ని నిల్వల్లో భాగంగా ఉంచుకోవడం ద్వారా కేంద్ర బ్యాంకులు తమ ఆస్తుల మధ్య సమతుల్యత సాధించడానికి ప్రయత్నిస్తాయి. చైనా కూడా ఈ విధానాన్ని అనుసరిస్తుండవచ్చని భావిస్తున్నారు.

ప్రపంచ అనిశ్చితిలో..

అంతర్జాతీయంగా రాజకీయ ఉద్రిక్తతలు పెరిగినప్పుడు, ఆర్థిక అస్థిరత ఏర్పడినప్పుడు, కరెన్సీల విలువల్లో హెచ్చుతగ్గులు చోటుచేసుకున్నప్పుడు బంగారానికి డిమాండ్ పెరిగే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో కేంద్ర బ్యాంకులు బంగారాన్ని దీర్ఘకాలిక వ్యూహాత్మక ఆస్తిగా పరిగణిస్తున్నాయి. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ 2026 నివేదిక ప్రకారం.. ఆ ఏడాది రెండో త్రైమాసికంలో ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు, ఇతర అధికారిక సంస్థలు నికరంగా 289 టన్నుల బంగారాన్ని కొనుగోలు చేశాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితి, నిల్వలను విభిన్న ఆస్తుల్లో విస్తరించుకోవాల్సిన అవసరం ఈ కొనుగోళ్లకు మద్దతునిచ్చాయని నివేదిక పేర్కొంది. ఈ కాలంలో చైనా కూడా తన బంగారు నిల్వలను పెంచుకుంది. దీంతో బంగారాన్ని నిల్వల్లో భాగంగా ఉంచుకోవాలనే ధోరణి ఒక్క చైనాకే పరిమితం కాలేదని స్పష్టమవుతోంది.

బంగారు నిల్వలను పెంచుకోవాలని..

ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు బంగారానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ సర్వే కూడా వెల్లడించింది. 2026 కేంద్ర బ్యాంకుల సర్వేలో పాల్గొన్న వారిలో 89 శాతం మంది.. రాబోయే 12 నెలల్లో ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు తమ బంగారు నిల్వలను పెంచుకుంటాయని అంచనా వేశారు. మరో 45 శాతం మంది తమ సొంత సంస్థలు కూడా బంగారానికి కేటాయించే వాటాను పెంచవచ్చని తెలిపారు. ఈ గణాంకాలు కేంద్ర బ్యాంకులు బంగారాన్ని కేవలం తక్కువ సమయంలో లాభాలు పొందే సాధనంగా చూడటం లేదని సూచిస్తున్నాయి. నిల్వల్లో వైవిధ్యం తీసుకురావడం, ఆర్థిక నష్టభయాలను నిర్వహించడం వంటి లక్ష్యాల కోసం కూడా బంగారాన్ని వినియోగిస్తున్నాయి. అయితే, ప్రతి దేశం కొనుగోలు నిర్ణయం ఆ దేశ ఆర్థిక అవసరాలు, ఇప్పటికే ఉన్న నిల్వలు, మార్కెట్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది.

బంగారం ధరలు ఎందుకు తగ్గాయి?

2026 సెప్టెంబర్‌లో అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరలు సుమారు 6 శాతం తగ్గాయి. అమెరికా డాలర్ బలపడటం, బాండ్లపై రాబడులు పెరగడం, వడ్డీ రేట్లు అధిక స్థాయిలో కొనసాగవచ్చనే అంచనాలు దీనికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. అమెరికా కేంద్ర బ్యాంకు ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల విషయంలో కఠిన వైఖరిని కొనసాగించవచ్చనే సంకేతాలు బంగారం మార్కెట్‌పై ప్రభావం చూపాయి. సాధారణంగా బంగారం నుంచి వడ్డీ రూపంలో ఆదాయం లభించదు. అదే సమయంలో ప్రభుత్వ బాండ్ల వంటి పెట్టుబడులు మెరుగైన రాబడులను అందించే పరిస్థితులు ఏర్పడితే, కొందరు పెట్టుబడిదారులకు బంగారంపై ఆసక్తి తగ్గవచ్చు. బలమైన డాలర్, పెరిగిన బాండ్ రాబడులు కూడా బంగారంపై ఒత్తిడిని పెంచాయి. ఈ పరిణామాల నేపథ్యంలో సెప్టెంబర్‌లో బంగారం ధరలు తగ్గినప్పటికీ, చైనా మాత్రం కొనుగోళ్లను కొనసాగించింది.

ధరల తగ్గుదలను అవకాశంగా చూస్తోందా చైనా?

బంగారం ధరలు వేగంగా పెరిగినప్పుడు కేంద్ర బ్యాంకులు భారీ స్థాయిలో కొనుగోళ్లు చేపట్టడం ఖరీదైన వ్యవహారంగా మారుతుంది. అదే ధరలు తగ్గినప్పుడు సమాన మొత్తంతో ఎక్కువ బంగారాన్ని కొనుగోలు చేసే అవకాశం లభించవచ్చు. సెప్టెంబర్‌లో బంగారం ధరలపై ఒత్తిడి నెలకొన్న నేపథ్యంలో చైనా తన నిల్వలను పెంచుకుంది. అయితే, ఈ కొనుగోళ్లకు ధరల తగ్గుదల ఒక్కటే కారణమని నిర్ధారించలేం. విదేశీ మారక నిల్వల నిర్వహణ, ఆస్తుల వైవిధ్యీకరణ, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో రిస్క్‌ను తగ్గించుకోవడం వంటి అంశాలు కూడా చైనా వ్యూహంలో భాగమై ఉండవచ్చు. వరుసగా 23 నెలలపాటు బంగారు నిల్వలను పెంచుకోవడం ఈ కొనుగోళ్లు దీర్ఘకాలిక ప్రణాళికలో భాగమై ఉండవచ్చనే అంచనాలకు బలం చేకూరుస్తోంది. అయితే, చైనా భవిష్యత్తులో ఎంత బంగారాన్ని కొనుగోలు చేస్తుంది, ఈ వ్యూహం అంతర్జాతీయ మార్కెట్లపై ఎలాంటి ప్రభావం చూపుతుంది అనేది రాబోయే పరిణామాలపై ఆధారపడి ఉంటుంది.

## అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఘన నివాళులు



గుంటూరు, అక్టోబర్ 15: (మహి న్యూస్): భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా గురువారం గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలాం దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

**ఎన్నికల నిబంధనలు పక్కాగా అమలు చేయాలి**

**అభ్యర్థుల ఖర్చులపై నిరంతర పర్యవేక్షణ**

**ఫ్లయింగ్ స్క్వాడ్లు, ప్రత్యేక బృందాలతో తనిఖీలు**




గుంటూరు, అక్టోబర్ 15: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రిటర్నింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల పరిశీలన, పోలింగ్ నిర్వహణ, ఓట్ల లెక్కింపులో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదన్నారు. ఎన్నికల పర్యవేక్షణకు స్టాటిక్ బృందాలు, సర్వైలెన్స్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఎన్నికల ఖర్చుల పరిశీలన బృందాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. అభ్యర్థుల ప్రతి ఖర్చును లెక్కల్లో నమోదు చేయాలని, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నారు. మీడియాలో ప్రచురితమయ్యే ప్రకటనల ఖర్చులను కూడా ఎన్నికల వ్యయంలో చేర్చాలని స్పష్టం చేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఎన్నికల పర్యవేక్షణ బృందాలతో సమీక్ష నిర్వహించి, ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని, రోజువారీ ఖర్చుల వివరాలను నమోదు చేసి కంట్రోల్ రూమ్‌కు అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, ఇతర అధికారులు, రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.





## ఎన్నికల సిబ్బంది తొలి ర్యాండమైజేషన్ పూర్తి





గుంటూరు, అక్టోబర్ 15: (మహి న్యూస్) : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా ప్రిసైడింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బంది తొలి ర్యాండమైజేషన్ ప్రక్రియను గురువారం పూర్తి చేశారు. గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్‌లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అథారిటీ సి.యం. సాయికాంత్ వర్మ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారి మోహన రాగిణి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు యంత్రాంగం పూర్తి సంసిద్ధం

**గుంటూరు, తెనాలిలో అక్టోబర్ 28న పోలింగ్**

**ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు నవంబర్ 3న**

**మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు**

**ఎన్నికల పర్యవేక్షణకు 50 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 50 స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు**



గుంటూరు, అక్టోబర్ 15: (మహి న్యూస్): జిల్లాలో పట్టణ స్థానిక సంస్థలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఎన్నికల షెడ్యూల్, ఏర్పాట్లను వివరించారు. గుంటూరు, తెనాలి పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలకు అక్టోబర్ 16 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమవుతుందని, అక్టోబర్ 28న పోలింగ్ జరుగుతుందని తెలిపారు. గుంటూరులో 76, తెనాలిలో 52 వార్డులకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అక్టోబర్ 21 నుంచి నామినేషన్లు స్వీకరించి, నవంబర్ 3న పోలింగ్ నిర్వహిస్తామని చెప్పారు. జిల్లాలో 16 ఎంపీపీ స్థానాలకు గాను 13 స్థానాలకు, 248 ఎంపీటీసీ స్థానాలకు గాను 199 స్థానాలకు ఎన్నికలు జరగనున్నట్లు వెల్లడించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నారు. నవంబర్ 26, 29, డిసెంబర్ 2 తేదీల్లో పోలింగ్ జరగనుంది. జిల్లాలోని 257 గ్రామ పంచాయతీల పరిధిలో ఎన్నికల ప్రక్రియను డిసెంబర్ 2 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినందున రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అక్రమాలను అరికట్టేందుకు జిల్లావ్యాప్తంగా 50 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 50 స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, జోనల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఎన్నికలు శాంతియుతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, జెడ్పీ సీఈవో జ్యోతి బసు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## జడ్పీటీసీ ఎన్నికలకు స్ట్రాంగ్ రూముల తనిఖీ

**భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల పరిశీలన**

**స్ట్రాంగ్ రూముల వద్ద 24 గంటల పోలీసు బందోబస్తు**

**ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణలో అవకతవకలకు తావులేకుండా చర్యలు**



మాచర్ల, అక్టోబర్ 15: (మహి న్యూస్): జడ్పీటీసీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా మాచర్ల నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్ కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంజన శ్రీ హర్ష తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాలు, అగ్నిమాపక పరికరాలు, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలను పరిశీలించారు. స్ట్రాంగ్ రూముల వద్ద 24 గంటల పాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు.



## మాచర్లలో ఘనంగా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

**విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన శ్రీ రామకృష్ణ సేవా సమితి సభ్యులు**

**నిరుపేద మహిళలకు చీరలు, స్వీట్ల పంపిణీ**



మాచర్ల, అక్టోబర్ 15: (మహి న్యూస్): భారత మాజీ రాష్ట్రపతి, గొప్ప శాస్త్రవేత్త, దేశభక్తుడు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను మాచర్లలో ఘనంగా నిర్వహించారు. శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో, స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న స్వామి వివేకానంద సేవాశ్రమంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు, పల్నాడు జిల్లా దిశ కమిటీ సభ్యుడు మెట్టు గోవిందరెడ్డి తన సభ్యులతో కలిసి సేవాశ్రమంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన కలాం చిన్నతనంలోనే పత్రికలు పంపిణీ చేస్తూ విద్యను అభ్యసించి, తన కృషి, పట్టుదలతో దేశ అత్యున్నత పదవైన రాష్ట్రపతి స్థాయికి ఎదిగారని కొనియాడారు. ఆయన జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని, క్రమశిక్షణ, నిజాయితీ, దేశభక్తి, అంకితభావానికి నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు.

### కలాం ఆశయాలను యువత ఆచరించాలి

"కలలు కనండి.. ఆ కలలను సాకారం చేసుకోండి" అనే కలాం సందేశాన్ని యువత స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధికి కృషి చేయాలని గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. శాస్త్రవేత్తగా, క్షిపణి రంగంలో విశేష సేవలందించిన వ్యక్తిగా, రాష్ట్రపతిగా ఆయన దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఆయన సేవలను గుర్తించి పద్మభూషణ్, పద్మవిభూషణ్, భారతరత్న వంటి అత్యున్నత పురస్కారాలతో గౌరవించడం దేశానికి గర్వకారణమన్నారు. కలాంకు విద్యార్థులంటే ఎంతో ప్రేమ అని, దేశ భవిష్యత్తు విద్యార్థుల చేతుల్లోనే ఉందని ఆయన బలంగా విశ్వసించేవారని గుర్తుచేశారు. రాష్ట్రపతిగా ఉన్న సమయంలోనూ విద్యార్థుల నుంచి వచ్చిన లేఖలకు సమయం కేటాయించి సమాధానాలు పంపేవారని తెలిపారు. 2030 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ఆయన ప్రసంగాల ద్వారా యువతలో దేశభక్తి, బాధ్యతాయుత ప్రవర్తన, సేవాభావాన్ని పెంపొందించేవారని పేర్కొన్నారు.

### నిరుపేద మహిళలకు చీరలు, స్వీట్ల పంపిణీ

జయంతి వేడుకల్లో భాగంగా స్వామి వివేకానంద సేవాశ్రమం సమీపంలో యాచక వృత్తి ద్వారా జీవనం సాగిస్తున్న మహిళలకు చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు. కలాం ఆశయాలకు అనుగుణంగా సేవాభావంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామకృష్ణ సేవా సమితి సభ్యులు ఎం. పాపిరెడ్డి, పి. హరిబాబు, ఉప్పుతోళ్ల వెంకటనారాయణ, ఆర్టీసీ రాయప్ప, ఎర్రబాతుల నాగశంకర్‌రెడ్డి, ఇందిరాదేవి, సుందరమ్మ, స్వరాజ్యం, శ్రీనివాసరావు తదితరులు, చిన్నారులు పాల్గొన్నారు.

## పల్నాడు జిల్లాలో స్థానిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

**తొలి విడతలో 7 మున్సిపాలిటీలు, 28 జెడ్పీటీసీ, 419 ఎంపీటీసీ స్థానాలు, 507 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు**

**మున్సిపాలిటీల్లో 465 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు**

**సమస్యాత్మక కేంద్రాల్లో అదనపు పోలీసు బలగాల మోహరింపు**

**రౌడీ షీటర్ల బైండోవర్, పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలు**




నరసరావుపేట, అక్టోబర్ 15: (మహి న్యూస్): పల్నాడు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ




పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాయని కలెక్టర్ కృతిక శుక్ల, జిల్లా ఎస్పీ కె. జగదీష్ అదహళ్లి తెలిపారు. నరసరావుపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఎన్నికల కార్యాచరణ, భద్రతా ఏర్పాట్లను వివరించారు. తొలి విడతలో పిడుగురాళ్ల, సత్తెనపల్లి, చిలకలూరిపేట, వినుకొండ, దాచేపల్లి, గురజాల, మాచర్ల మున్సిపాలిటీల్లోని 247 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 3,38,294 మంది ఓటర్ల కోసం 465 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 188 హైపర్ సెన్సిటివ్, 155 సెన్సిటివ్ కేంద్రాలుగా గుర్తించారు. ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. కోర్టు కేసులు, డీలిమిటేషన్ ప్రక్రియ కారణంగా నరసరావుపేట మున్సిపాలిటీకి నవంబర్ 15 తర్వాత రెండో విడతలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి జిల్లాలో 28 జెడ్పీటీసీ, 419 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. వీటి కోసం 1,548 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, 706 హైపర్ సెన్సిటివ్, 488 సెన్సిటివ్ కేంద్రాలుగా గుర్తించారు. అమరావతి మండలంలోని 13 ఎంపీటీసీ స్థానాలకు సీఆర్‌డీఏ విలీన ప్రతిపాదనల కారణంగా తాత్కాలికంగా ఎన్నికలు నిలిపివేశారు. జిల్లాలోని 507 గ్రామ పంచాయతీల పరిధిలో 5,216 వార్డులకు 5,270 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. 183 పంచాయతీలను హైపర్ సెన్సిటివ్‌గా, 150 పంచాయతీలను సెన్సిటివ్‌గా గుర్తించారు. సీఆర్‌డీఏ విలీన ప్రతిపాదనల కారణంగా అమరావతిలో 15, పెదకూరపాడులో 3 గ్రామాలు, నరసరావుపేట మున్సిపాలిటీ విలీన పరిధిలోని 5 గ్రామాలను ఈ విడత ఎన్నికల నుంచి మినహాయించినట్లు కలెక్టర్ వెల్లడించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు మున్సిపాలిటీలు, మండలాల వారీగా స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, ఎంసీసీ బృందాలను ఏర్పాటు చేశారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద 24 గంటల పాటు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ కె. జగదీష్ అదహళ్లి తెలిపారు. రౌడీ షీటర్లు, అనుమానితులను బైండోవర్ చేయడంతో పాటు కౌన్సెలింగ్ ఇస్తున్నామని, పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్




వారెంట్లను అమలు చేస్తున్నామని చెప్పారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిరంతర నిఘా ఉంచి అదనపు పోలీసు బలగాలను మోహరిస్తున్నట్లు వివరించారు. నామినేషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లు, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని కలెక్టర్, ఎస్పీ కోరారు.

## అగ్రిగోల్డ్ బాండ్ల పరిశీలనకు హాజరుకావాలి

**అక్టోబర్ 16, 17 తేదీల్లో చేబ్రోలు, కాకుమాను, పెదనందిపాడు మండలాల బాండ్ల పరిశీలన**

**ఒరిజినల్ బాండ్, ఆధార్, బ్యాంకు పాస్‌బుక్, ఫొటో తీసుకురావాలి**



గుంటూరు, అక్టోబర్ 15: (మహి న్యూస్): అగ్రిగోల్డ్ బాండ్ల పరిశీలనలో భాగంగా అక్టోబర్ 15న చేబ్రోలు మండలానికి చెందిన 156 మంది నుంచి 226 అగ్రిగోల్డ్ బాండ్లను పరిశీలించినట్లు సీఐడీ గుంటూరు రీజనల్ ఆఫీస్ అధికారి, అదనపు పోలీసు సూపరింటెండెంట్ బి. సీతారామయ్య తెలిపారు. అక్టోబర్ 16, 17 తేదీల్లో చేబ్రోలు, కాకుమాను, పెదనందిపాడు మండలాలకు చెందిన అగ్రిగోల్డ్ బాండ్లను బాండ్లలో నమోదైన చిరునామాల ఆధారంగా గుంటూరు రీజనల్ ఆఫీస్‌లోని సీఐడీ కార్యాలయంలో పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధిత మండలాలకు చెందిన బాండ్ హోల్డర్లు నిర్ణీత తేదీల్లో కార్యాలయానికి హాజరుకావాలని సూచించారు. వచ్చేటప్పుడు ఒరిజినల్ అగ్రిగోల్డ్ బాండ్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఒక పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో పాటు సంబంధిత పత్రాల జిరాక్స్ కాపీలు తీసుకురావాలని కోరారు.

## జడ్పీటీసీ ఎన్నికలకు స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్ కేంద్రాల తనిఖీ

**భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాలు, అగ్నిమాపక పరికరాల పరిశీలన**

**స్ట్రాంగ్ రూముల వద్ద 24 గంటల పోలీసు బందోబస్తు**

**పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణలో అవకతవకలకు తావులేకుండా చర్యలు**



చిలకలూరిపేట, అక్టోబర్ 15: (మహి న్యూస్): జడ్పీటీసీ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా చిలకలూరిపేట నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్ కేంద్రాలను జిల్లా జాయింట్ కలెక్టర్, జడ్పీటీసీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంజన శ్రీ హర్ష తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూములు, రిసెప్షన్, కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాలు, అగ్నిమాపక పరికరాలు, తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్ట్రాంగ్ రూముల వద్ద 24 గంటల పాటు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమర్థవంతంగా పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

## అడిగొప్పలలో వైభవంగా శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి పూజలు



దుర్గి అక్టోబర్ 15: (మహి న్యూస్): పల్నాడు జిల్లా, దుర్గి: మండలం అడిగొప్పల గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ నిదానంపాటి శ్రీ లక్ష్మీ అమ్మవారి దేవస్థానంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు చేయడంతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పూజా కార్యక్రమాలు ఎంతో వైభవంగా ముగిశాయి.

## అమరావతి ప్రాంతీయ సదస్సుకు రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతి

**ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి సదస్సు నిర్వహణ**

**మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేల పాల్గొనడంపై నిషేధం**

**ప్రభుత్వ విజయాలపై ప్రసంగాలకు అనుమతి లేదు**

గుంటూరు, అక్టోబర్ 15: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి అమరావతి ప్రాంతీయ సదస్సు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చినట్లు గుంటూరు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు--2026లో భాగంగా అక్టోబర్ 16న అమరావతిలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో ప్రాంతీయ సదస్సు నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల రెండో సాధారణ ఎన్నికల షెడ్యూలును రాష్ట్ర ఎన్నికల సంఘం అక్టోబర్ 14న ప్రకటించడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది.

రాష్ట్ర ఎన్నికల సంఘం అక్టోబర్ 15న జారీ చేసిన అనుమతి ప్రకారం సదస్సు నిర్వహణకు పలు షరతులు విధించింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు సదస్సులో పాల్గొనకూడదు.

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పూర్తిగా పాటించాలి. ప్రభుత్వం లేదా అధికార పార్టీ సాధించిన విజయాలపై ప్రసంగాలు చేయరాదు.

అవగాహన ఒప్పందాల మార్పిడి ప్రభుత్వ అధికారులు, పెట్టుబడిదారుల మధ్య మాత్రమే జరగాలి. వారు కూడా ప్రభుత్వ విజయాలపై ప్రసంగించకూడదు.

సదస్సు పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు సంబంధించిన అంశాలకే పరిమితం కావాలి.

కార్యక్రమ ఫ్లెక్సీలు, బ్యానర్లపై మంత్రులు లేదా అనధికార వ్యక్తుల ఫొటోలు ప్రదర్శించరాదు.

ఈ నిబంధనలకు అనుగుణంగా కార్యక్రమం నిర్వహించేలా వక్తలు, నిర్వాహకులు, ప్రెజెంటేషన్ బృందాలకు లిఖితపూర్వక సూచనలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని, ఎన్నికల సమయంలో జరిగే అన్ని అధికారిక కార్యక్రమాల్లో ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు.

## కనకాలపేట కనకదుర్గమ్మ ఆలయంలో ఘనంగా లక్ష కుంకుమార్చన



యానం, మహి న్యూస్, అక్టోబర్ 15: కేంద్రపాలిత ప్రాంతమైన యానాం శివారు కనకాలపేట గ్రామంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో 41వ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ కోనంభట్ల శ్రీరామచంద్రమూర్తి, సాయిశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చారణల నడుమ లక్ష కుంకుమార్చన నిర్వహించారు. గురు భవాని పోలిశెట్టి రామకృష్ణ పర్యవేక్షణలో నరసింహమూర్తి కుటుంబ సభ్యులు పడిపూజ నిర్వహించి, భవానీ దీక్షలో భాగంగా వడి సమర్పించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దివ్య అలంకరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోగా, భక్తుల రాకతో ఆలయం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు కనకాల కృష్ణ, పోలిశెట్టి రామకృష్ణ, కనకాల సూరిబాబు, కనకాల సత్తిబాబు, మల్లిపూడి గోవిందు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
# మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com


## స్కాట్లాండ్‌లో కామన్‌వెల్త్ కరాటే ఛాంపియన్‌షిప్‌కు హెచ్.మంత్‌కు రూ.4 లక్షల స్పాన్సర్‌షిప్



తిరుపతి, అక్టోబర్ 15: (మహి న్యూస్): స్కాట్లాండ్‌లో త్వరలో జరగనున్న ప్రతిష్టాత్మక కామన్‌వెల్త్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలకు భారత్ తరపున ఎంపికైన కరాటే క్రీడాకారుడు పొట్టిపాటి హేమంత్ కుమార్ రెడ్డికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తిరుపతి జోనల్ కార్యాలయం రూ.4 లక్షల స్పాన్సర్‌షిప్ మంజూరు చేసింది. ఈ ప్రోత్సాహక మొత్తానికి సంబంధించిన చెక్కును యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జోనల్ హెడ్, జనరల్ మేనేజర్ పత్రి శ్రీనివాస కుమార్ క్రీడాకారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జోనల్ హెడ్ సూర్య ప్రకాశ్ పాల్గొన్నారు. స్పాన్సర్‌షిప్ మంజూరులో కీలక పాత్ర పోషించిన గుంటూరు రవికుమార్, ఎల్‌డీఎంకు క్రీడాకారుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎన్నికల విధులకు ఉద్యోగుల వివరాలు సకాలంలో సమర్పించాలి

### శాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
### అక్టోబర్ 16, 17, 18 తేదీల్లో ఎన్నికల సిబ్బందికి శిక్షణ
### నిర్లక్ష్యం వహిస్తే నిబంధనల ప్రకారం చర్యలు



చిత్తూరు, అక్టోబర్ 15: (మహి న్యూస్): చిత్తూరు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల విధుల నిర్వహణకు అవసరమైన ఉద్యోగుల పూర్తి వివరాలను సకాలంలో ఎక్సెల్ షీట్‌లో సమర్పించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ శాఖాధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఎన్నికల విధుల కేటాయింపుపై దిశానిర్దేశం చేశారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ పాల్గొన్నారు. కొన్ని శాఖల నుంచి ఉద్యోగుల వివరాలు ఇంకా పూర్తిస్థాయిలో అందలేదని కలెక్టర్ తెలిపారు. ప్రతి శాఖాధికారి తమ కార్యాలయంతో పాటు క్షేత్రస్థాయి, మండల స్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాలను సేకరించి, జిల్లా ఎన్నికల కార్యాలయం అందించిన ఎక్సెల్ షీట్‌లో నమోదు చేసి సమర్పించాలని సూచించారు.



గురువారం సాయంత్రం 6.30 గంటల్లోపు లేదా నిర్దేశించిన గడువులోగా వివరాలు అందించాలని స్పష్టం చేశారు. ఉద్యోగుల వివరాలు అందిన తర్వాత వాటిని పరిశీలించి ఎన్నికల విధుల కేటాయింపునకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. అర్హులైన ఉద్యోగుల వివరాల నమోదులో ఎలాంటి పక్షపాతం ఉండకూడదని పేర్కొన్నారు. గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, నిర్దిష్ట వైద్య సమస్యలు ఉన్నవారు, దివ్యాంగులు, క్యాన్సర్‌తో బాధపడుతున్నవారు, మానసిక వైకల్యం కలిగిన పిల్లల సంరక్షణకు సంబంధించిన ప్రత్యేక పరిస్థితులు ఉన్న ఉద్యోగులకు వర్తించే నిబంధనల ప్రకారం మినహాయింపులను పరిశీలించాలని అధికారులకు సూచించారు. ఇందుకు అవసరమైన ప్రభుత్వ వైద్య ధ్రువపత్రాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని తెలిపారు. అక్టోబర్ 16, 17, 18 తేదీల్లో ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. చిత్తూరు, కుప్పం, పలమనేరు ప్రాంతాల్లో శిక్షణకు సంబంధించి సంబంధిత శాఖలు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించినా, నిర్ణీత గడువులోగా ఉద్యోగుల వివరాలు సమర్పించకపోయినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## మొగిలి శ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవములు...

### ఐదవ రోజు "మూలవిరాట్టు అమ్మవావరికి విభూది " అలంకారం



చిత్తూరు జిల్లా/ బంగారుపాళ్యం మహీ న్యూస్. అక్టోబర్ 15.: చిత్తూరు జిల్లా బంగారుపాలెం మండలం శ్రీ మొగిలీస్వర స్వామి దేవస్థానము నందు శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవము ఐదవ రోజు వైభవముగా నిర్వహించబడుచున్నవి.



గురువారం ది.15.10.2026 న సాయంత్రం కామాక్షి దేవి అమ్మవారికి ఉదయం అభిషేకం, అలంకరణ, మహా దీపారాధన నిర్వహించడం జరిగినది.అనంతరం శ్రీ మొగిలీశ్వర స్వామి వారికి అభిషేకం, అలంకరణ, మహా దీపారాధన చేయడం జరిగినది. సాయంత్రము శ్రీ అమ్మవారికి కుంకుమార్చన,ధూపదీప నైవేద్యములతో మహాదీపారాధన కార్యక్రమం చేపట్టడం జరిగినది.నవరాత్రి ఉత్సవమునకు ఉభయ దారులుగా దేవపత్ని మంజునాథ్ నాయుడు మొగిలి గ్రామం వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. వీరికి వేద మంత్రాలతో ఆశీర్వదించి ప్రసాదం ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మరియు ఆలయ అర్చకులు, సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## తిరుపతి జిల్లాలో సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లు ఖరారు

### 805 సర్పంచ్ స్థానాలు, 7,472 వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్లు
### ఎస్టీ, ఎస్సీ, బీసీ, ఇతర కేటగిరీల వారీగా స్థానాల కేటాయింపు
### రెండు గ్రామ పంచాయతీలకు ఓటర్ల జాబితా ప్రచురణ తర్వాత రిజర్వేషన్లు

తిరుపతి, అక్టోబర్ 15: (మహి న్యూస్): తిరుపతి జిల్లాలో రెండో సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాల రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి సుశీలా దేవి తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రిజర్వేషన్ల వివరాలను వెల్లడించారు. జిల్లాలో మొత్తం 805 సర్పంచ్ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఇందులో ఎస్టీ కేటగిరీలో 73 స్థానాలు, ఎస్సీ కేటగిరీలో 229, బీసీ కేటగిరీలో 94, ఇతర కేటగిరీ (అన్‌రిజర్వ్‌డ్)లో 409 స్థానాలు కేటాయించారు. వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి జిల్లాలో మొత్తం 7,472 స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. వీటిలో ఎస్టీ కేటగిరీకి 677, ఎస్సీ కేటగిరీకి 1,944, బీసీ కేటగిరీకి 1,036, ఇతర కేటగిరీకి 3,815 స్థానాలు కేటాయించారు. ప్రతి కేటగిరీలో జనరల్, మహిళల స్థానాలను వేర్వేరుగా విభజించారు. తొట్టంబేడు మండలంలోని తొట్టంబేడు గ్రామ పంచాయతీలో కొంత భాగం, శ్రీకాళహస్తి మండలంలోని ఉడమలపాడు గ్రామ పంచాయతీలో కొంత భాగం శ్రీకాళహస్తి మున్సిపాలిటీలో విలీనమైనందున ఈ రెండు పంచాయతీలకు ప్రస్తుతం రిజర్వేషన్లు ఖరారు చేయలేదని జిల్లా పంచాయతీ అధికారి తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా ప్రచురించిన అనంతరం ఈ రెండు గ్రామ పంచాయతీల రిజర్వేషన్లను ఖరారు చేయనున్నట్లు వెల్లడించారు.

## విద్యుత్ షాక్‌తో జూనియర్ లైన్‌మెన్ మృతి



చిత్తూరు జిల్లా /బంగారుపాళ్యం మహి న్యూస్ అక్టోబర్ 15.: చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం మండలం బోరబండ్ల సచివాలయంలో పనిచేయు జూనియర్ లైన్మెన్ ముని కుమార్ వయస్సు 30 సంవత్సరాలు అను ఇతను 15-10-2026వ తేదీ గురువారం ఉదయం సుమారు 8.30 గంటలకు, బంగారుపాళ్యం మండలం, దేగలబండ గ్రామ సమీపంలో సి.ఎస్.పురం--బంగారుపాళ్యం రోడ్డు పక్కన సురేష్‌కు చెందిన షెడ్డు ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభం వద్ద విద్యుత్ షాక్‌కు గురై ఈ. మునికుమార్ (30 సంవత్సరాలు), తండ్రి ఏ. ఏలుమలై, డోర్ నెం. 17-352, గణేష్ నగర్, రేణిగుంట టౌన్, తిరుపతి జిల్లా, మృతి చెందాడు. మృతుడు గత ఏడు సంవత్సరాలుగా బంగారుపాళ్యం మండలం, బోడబండ్ల పంచాయతీ పరిధిలో జూనియర్ లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. దేగలబండ సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు పనులు పూర్తి చేసిన అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు ఏబీ స్విచ్‌ను ఆన్ చేయడానికి ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందినట్లు ప్రాథమిక విచారణలో తెలిసింది.సమాచారం అందుకున్న బంగారుపాళ్యం పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై మృతుని భార్య వి. సోనీయ పిర్యాదు పై కేసు నమోదు చేసి తదుపరి విచారణ చేపట్టారు.



# స్థానిక సంస్థల ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలి

### నామినేషన్ల నుంచి ఓట్ల లెక్కింపు వరకు పకడ్బందీ ఏర్పాట్లు
### సున్నిత, అత్యంత సున్నిత ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు
### ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు





తిరుపతి, అక్టోబర్ 15: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావుతో కలిసి ఎన్నికల నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నామినేషన్ల స్వీకరణ కేంద్రాల్లో హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసి అభ్యర్థులకు అవసరమైన సమాచారం అందించాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ సమయాన్ని కచ్చితంగా పాటించాలని, నామినేషన్ పత్రాలు, ఓటరు వివరాలు, అర్హతలు, ధ్రువపత్రాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని తెలిపారు. అభ్యర్థులందరినీ సమానంగా చూడాలని, నో డ్యూస్ ధ్రువపత్రాల జారీలో జాప్యం చేయరాదన్నారు. ఓటరు జాబితాలు, వార్డుల పరిధులు, పోలింగ్ కేంద్రాలను ముందుగానే పరిశీలించి ఓటర్లకు తాగునీరు, విద్యుత్, సూచిక బోర్డులు, బారికేడింగ్ వంటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఓటరు స్లిప్పులను ఇంటింటికీ పంపిణీ చేసి ప్రతి అర్హుడికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించాలన్నారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో వార్డుల సంఖ్య 50 నుంచి 66కు పెరిగిన నేపథ్యంలో కొత్త వార్డులు, పోలింగ్ కేంద్రాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణ, నిల్వ, రవాణా, వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, భద్రతా సిబ్బంది, ఇతర ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సిబ్బందికి రెండు విడతల్లో శిక్షణ ఇచ్చి, విధులపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహించినా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు మాట్లాడుతూ సాధారణ, సున్నిత, అత్యంత సున్నిత ప్రాంతాలను గుర్తించి పటిష్ట బందోబస్తు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ప్రతి మున్సిపాలిటీ, నగరపాలక సంస్థతో పాటు కలెక్టరేట్‌లో ఎన్నికల సెల్‌లు ఏర్పాటు చేయాలని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమస్యాత్మక వ్యక్తులు, రౌడీషీటర్లను గుర్తించి చట్టప్రకారం ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు మాట్లాడుతూ ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు సహా ఎన్నికల సిబ్బంది నిబంధనలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికల ప్రచారం, బహిరంగ సభలు, ఊరేగింపులకు నిబంధనల ప్రకారం ముందస్తు అనుమతులు తీసుకోవాలని, ప్రచార సమయ పరిమితులు, మద్యం విక్రయాలపై ఆంక్షలను కచ్చితంగా అమలు చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో జి. నరసింహులు, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు తదితరులు వర్చువల్‌గా హాజరయ్యారు.

# తిరుపతి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు సర్వసన్నద్ధం

### మున్సిపల్ కార్పొరేషన్, ఐదు మున్సిపాలిటీల్లో ఎన్నికల నియమావళి అమలు
### అక్టోబర్ 16, 17, 18 తేదీల్లో నామినేషన్ల స్వీకరణ
### సీసీ కెమెరాలు, డ్రోన్లతో భద్రతపై నిఘా



తిరుపతి, అక్టోబర్ 15: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు తిరుపతి జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, డీఆర్వో జి. నరసింహులుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికల ఏర్పాట్లను వివరించారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు వెంకటగిరి, పుత్తూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఈ నెల 16, 17, 18 తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని పేర్కొన్నారు. మేయర్, మున్సిపల్ చైర్‌పర్సన్, వార్డు సభ్యుల పదవులకు వేర్వేరుగా నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. నిర్ణీత సమయం తర్వాత వచ్చే నామినేషన్లను స్వీకరించబోమని స్పష్టం చేశారు. ఈ నెల 19న నామినేషన్ల పరిశీలన, 21న ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించి, అదే రోజు తుది అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామని తెలిపారు. ఈ నెల 28న పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ఈ నెల 19న నోటిఫికేషన్ విడుదల కానుండగా, గ్రామ పంచాయతీ ఎన్నికలకు మూడు విడతల్లో నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు వివరించారు. నామినేషన్ కేంద్రాల వద్ద హెల్ప్ డెస్క్‌లు, బారికేడింగ్, సీసీటీవీ కెమెరాలు, వీడియోగ్రఫీ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నియమావళి అమలును పర్యవేక్షించేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలను నియమించినట్లు చెప్పారు. స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్, రిసెప్షన్, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను ముందుగానే గుర్తించి భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ఈ నెల 20 వరకు కొనసాగనున్న నేపథ్యంలో ఉత్సవాలకు ఆటంకం కలగకుండా ఎన్నికల విధుల నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు కలెక్టర్ వివరించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే అధికారులు, రాజకీయ నాయకులు, అభ్యర్థులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు మాట్లాడుతూ నామినేషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంచడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో డ్రోన్లను వినియోగిస్తామని వెల్లడించారు. ఎన్నికలకు ముందు, పోలింగ్ రోజు, అనంతరం చేపట్టాల్సిన భద్రతా చర్యలపై సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. పోలీసు బలగాల మోహరింపు, రవాణా మార్గాలు, రూట్ మొబైల్స్, ఎన్నికల సామగ్రి తరలింపునకు భద్రత కల్పిస్తామని తెలిపారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తాయని ఎస్పీ పేర్కొన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటిస్తూ ఎన్నికల అధికారులకు సహకరించాలని కోరారు.

# చిత్తూరు జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు, పంచాయతీ రిజర్వేషన్లు ఖరారు

### ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలి
### 27 మండలాల్లో 622 గ్రామ పంచాయతీలు, 5,906 వార్డులకు రిజర్వేషన్లు ఖరారు
### ఓటర్లకు నగదు, మద్యం, బహుమతులు పంపిణీ చేయరాదు
### రిజర్వేషన్ల వివరాలు ఎంపీడీవో కార్యాలయాల్లో అందుబాటులో

చిత్తూరు, అక్టోబర్ 15: (మహి న్యూస్): చిత్తూరు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయడంతో పాటు, 2026 సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికలకు సర్పంచ్‌లు, వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ తెలిపారు. జిల్లాలోని 27 మండలాల పరిధిలో 622 గ్రామ పంచాయతీలు, 5,906 వార్డులకు జనాభా ప్రాతిపదికన ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా రిజర్వేషన్లు కేటాయిస్తూ గురువారం అసాధారణ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. సర్పంచ్ స్థానాల్లో షెడ్యూల్డ్ కులాలకు 155, షెడ్యూల్డ్ తెగలకు 19, వెనుకబడిన తరగతులకు 126 స్థానాలు కేటాయించారు. మిగిలిన 316 స్థానాలు జనరల్ కేటగిరీకి కేటాయించారు. వార్డు సభ్యుల స్థానాల్లో ఎస్సీలకు 1,386, ఎస్టీలకు 183, బీసీలకు 1,326, జనరల్ కేటగిరీకి 3,011 స్థానాలు కేటాయించారు. మహిళలకు కేటాయించిన రిజర్వేషన్ల వివరాలను కూడా గెజిట్‌లో పొందుపరిచారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ప్రభుత్వ భవనాలు, విద్యుత్ స్తంభాలు, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ ఫ్లెక్సీలు, పోస్టర్లు, బ్యానర్లు, గోడ రాతలు ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఓటర్లకు నగదు, మద్యం, బహుమతులు పంపిణీ చేయడం, ఉచిత వస్తువులతో ప్రలోభపెట్టడం నేరమని తెలిపారు. కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేయరాదని, ప్రార్థనా మందిరాలను ప్రచార వేదికలుగా ఉపయోగించకూడదని సూచించారు. ప్రభుత్వ వాహనాలు, నిధులు, భవనాలు, ప్రభుత్వ పథకాలను ఎన్నికల ప్రయోజనాల కోసం వినియోగించరాదని పేర్కొన్నారు. ఓటర్లను ఆకర్షించేలా కొత్త పథకాలు ప్రకటించడం, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, కొత్త నిధుల మంజూరు చేయడం నిషేధమని తెలిపారు. మైకులు, లౌడ్‌స్పీకర్ల వినియోగానికి ముందస్తు అనుమతి తప్పనిసరని, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు వాటిని వినియోగించరాదని వెల్లడించారు. సరైన ఆధారాలు, పత్రాలు లేకుండా రూ.50 వేలకుపైగా నగదు తరలించకూడదని స్పష్టం చేశారు. సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్ల వివరాలను జిల్లా కలెక్టరేట్, డివిజనల్ పంచాయతీ కార్యాలయాలు, మండల పరిషత్ అభివృద్ధి అధికారుల కార్యాలయాల్లో ప్రదర్శించినట్లు తెలిపారు. ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమ పంచాయతీ, వార్డుల రిజర్వేషన్ వివరాలను సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల్లో లేదా చిత్తూరు జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవచ్చని కలెక్టర్ సూచించారు.

## స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

### ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



కడప జిల్లా/ఎర్రగుంట్ల, మహి న్యూస్, అక్టోబర్ 15: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని జమ్మలమడుగు నియోజకవర్గ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్



చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి, కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చదిపిరాళ్ల భూపేష్ సుబ్బరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఎర్రగుంట్ల కూటమి కార్యాలయంలో మున్సిపాలిటీ, మండల స్థాయి నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమి తరఫున పోటీ చేసే అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి ఐక్యతతో ఎన్నికల బరిలోకి దిగి వంద శాతం విజయాల లక్ష్యంతో ముందుకు సాగుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో భారతీయ జనతా యువమోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజేష్ రెడ్డి, ఎర్రగుంట్ల మండల కూటమి ఇన్‌చార్జి మధుసూదన్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ నాగరాజు, జాతీయ ప్రజాస్వామ్య కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

## అక్టోబర్ 28న పట్టణ స్థానిక సంస్థల పోలింగ్ నవంబర్ 3న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు - మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కర్నూలు, అక్టోబర్ 15: (మహి న్యూస్): కర్నూలు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికల షెడ్యూల్‌ను వెల్లడించారు. కర్నూలు నగరపాలక సంస్థ, ఎమ్మిగనూరు, ఆదోని మున్సిపాలిటీలు, గూడూరు నగర పంచాయతీ ఎన్నికలకు అక్టోబర్ 16 నుంచి 18 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అక్టోబర్ 28న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు అక్టోబర్ 21 నుంచి 23 వరకు నామినేషన్లు స్వీకరించి, నవంబర్ 3న పోలింగ్, 5న ఓట్ల లెక్కింపు చేపడతారు. గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించనున్నారు. తొలి దశ పోలింగ్ నవంబర్ 26న, రెండో దశ నవంబర్ 29న, మూడో దశ డిసెంబర్ 2న జరగనుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను 1800 425 4299 నంబర్‌కు తెలియజేయవచ్చని తెలిపారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రత్యేక పోలీసు బృందాలతో నిరంతర నిఘా కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ మాట్లాడుతూ నామినేషన్ల ప్రక్రియపై అభ్యర్థులకు అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాలు, హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అక్రమ ఏకగ్రీవ ఎన్నికలపై ఆర్డీఓ ఆధ్వర్యంలో విచారణ చేపడతామని వెల్లడించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా పరిషత్ సీఈవో సుధాకర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ పాల్గొన్నారు.

# ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు

## సిబ్బంది, ఏజెంట్లకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు
## - బస్సుల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు
## - స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ కేంద్రాల ఏర్పాట్ల పరిశీలన




కర్నూలు, అక్టోబర్ 15: (మహి న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎన్నికల సామగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి అధికారులను ఆదేశించారు. కర్నూలు నగర శివార్లలోని ఏథేనా స్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ కేంద్రాలను జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో కలిసి పరిశీలించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఆహారం, తాగునీరు, విశ్రాంతి గదులు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సామగ్రి తరలింపునకు తగినంత మంది



హమాలీలను నియమించి, ప్రత్యేక యూనిఫాంలు ఏర్పాటు చేయాలని తెలిపారు. సిబ్బంది, రాజకీయ పార్టీల ఏజెంట్ల రాకపోకలకు ప్రత్యేక మార్గాలు, బారికేడ్లు, దిశా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ బస్సుల రాకపోకలతో ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. బస్సుల రాక, సిబ్బంది దిగడం, ఎన్నికల సామగ్రి పంపిణీ ప్రక్రియ సజావుగా జరిగేలా ముందస్తు రిహార్సల్స్ నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలు, నగర పంచాయతీ ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు

## ఎన్నికల నిబంధనలపై అధికారులకు అవగాహన
## - సమన్వయం, పారదర్శకతతో ఎన్నికల నిర్వహణ
## - రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల అమలుకు ఆదేశాలు






నంద్యాల, అక్టోబర్ 15: (మహి న్యూస్): నంద్యాల జిల్లాలో మున్సిపాలిటీలు, నగర పంచాయతీ ఎన్నికలను నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల అధికారులు, అదనపు ఎన్నికల అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె దిశానిర్దేశం చేశారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు తమ బాధ్యతలు, ఎన్నికల ప్రక్రియలోని వివిధ దశలు, నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నికల ఏర్పాట్లు, రికార్డుల నిర్వహణ, విధుల కేటాయింపు, అధికారుల మధ్య



సమన్వయంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శేషన్న, ట్రైనీ కలెక్టర్ ప్రియాంక, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా నోడల్ అధికారులు, ఆరు మున్సిపాలిటీల కమిషనర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 16న కొలనుభారతీ క్షేత్రంలో మూలానక్షత్ర ప్రత్యేకపూజలు

శ్రీశైలం, మహి న్యూస్, అక్టోబర్ 15 : శ్రీశైలదేవస్థాన దత్తత దేవాలయమైన కొలనుభారతీక్షేత్రంలో ఈ నెల 16వ తేదీన మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేకపూజలు, అభిషేకాది అర్చనలు నిర్వహించబడుతున్నాయి. లోకకల్యాణార్థం జరిపే ఈ ఉత్సవాలలో సరస్వతీదేవి అమ్మవారికి విశేష అర్చనలు, చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు జరిపించబడుతాయి. 16 న మూలానక్షత్రం సందర్భంగా ఉదయం గం. 4.00లకు ఆలయప్రధాన ద్వారాలు తెరువబడుతాయి. మంగళవాయిద్యాలతో ఆలయకైంకర్యాలు ప్రారంభించబడుతాయి. ముందుగా తీర్థబిందెసేవ జరిపించబడుతుంది. ఈ తీర్థ బిందుసేవలో సంప్రదాయబద్దంగా కొలను నుండి జలాలను తీసుకొని ఆలయప్రవేశం చేయడం జరుగుతుంది. తరువాత గణపతిపూజ జరిపించబడుతుంది. అనంతరం అమ్మవారికి విశేషఅభిషేకం, ప్రత్యేకపూజలు, పుష్పార్చన, బాలభోగనివేదన, మహామంగళహారతి కార్యక్రమాలు ఉంటాయి. అనంతరం ఉదయం గం. 6.00ల నుంచి భక్తులకు అమ్మవారి దర్శనాలు మరియు సామూహిక అక్షరాభాస్యాలు ప్రారంభించబడుతాయి. 11.15 గం. లకు అమ్మవారి మధ్యాహ్నకాలపూజలు, మహానివేదన తరువాత గం. 11.45 నుంచి దర్శనాలు కొనసాగుతాయి. తిరిగి సాయంకాలం గం. 6.00లకు ప్రదోషకాలపూజ, నివేదన, మహామంగళహారతుల అనంతరం రాత్రి గం. 7.00లకు కవాటబంధనం ( ఆలయద్వారాలు మూసివేత) ఉంటుంది. కావున భక్తులందరూ కూడా ఈ పర్వదినం రోజున అమ్మవారిని దర్శించి తరించవలసినదిగా తెలియజేస్తున్నాం.

# స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదల

## అక్టోబర్ 28న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు నవంబర్ 3న ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోలింగ్ మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు ఫిర్యాదుల కోసం 1800 425 4299 నంబర్

కర్నూలు, అక్టోబర్ 15: (మహి న్యూస్): కర్నూలు జిల్లాలో పట్టణ స్థానిక సంస్థలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎన్నికల షెడ్యూల్, నామినేషన్ల స్వీకరణ, పోలింగ్, ఓట్ల లెక్కింపు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి, అభ్యర్థుల వ్యయ పరిమితులు, ఫిర్యాదుల పరిష్కారంపై వివరించారు.

### పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు

కర్నూలు నగరపాలక సంస్థ, ఎమ్మిగనూరు, ఆదోని మున్సిపాలిటీలు, గూడూరు నగర పంచాయతీ ఎన్నికలకు అక్టోబర్ 14న నోటిఫికేషన్ విడుదల చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అక్టోబర్ 16 నుంచి 18 వరకు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. అక్టోబర్ 19న నామినేషన్ల పరిశీలన, 21న ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించి తుది అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. అక్టోబర్ 28న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్, అవసరమైతే 29న రీపోలింగ్ నిర్వహిస్తారు. అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన ఉంటుంది.

### ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ అక్టోబర్ 19న విడుదల కానుంది. అక్టోబర్ 21 నుంచి 23 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 24న పరిశీలన, 25న తిరస్కరణకు గురైన నామినేషన్లపై అప్పీళ్లు, 26న అప్పీళ్ల పరిష్కారం చేపడతారు. అక్టోబర్ 27న నామినేషన్ల ఉపసంహరణతో పాటు తుది అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. నవంబర్ 3న పోలింగ్, అవసరమైతే 4న రీపోలింగ్ నిర్వహించి, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు చేపడతారు.

### మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు

గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు దశల్లో నిర్వహించేందుకు షెడ్యూల్ రూపొందించినట్లు కలెక్టర్ తెలిపారు.

మొదటి దశ: నవంబర్ 13న నోటిఫికేషన్ విడుదల చేస్తారు. నవంబర్ 17 వరకు నామినేషన్ల స్వీకరణ, 18న పరిశీలన, 19న అప్పీళ్లు, 21న అప్పీళ్ల పరిష్కారం, నామినేషన్ల ఉపసంహరణ, తుది జాబితా ప్రకటన ఉంటాయి. నవంబర్ 26న పోలింగ్, అవసరమైతే 27న రీపోలింగ్ నిర్వహించి ఓట్ల లెక్కింపు చేపడతారు.

రెండో దశ: నవంబర్ 16న నోటిఫికేషన్ విడుదల చేసి, నవంబర్ 20 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 21న పరిశీలన, 22న అప్పీళ్లు, 23న అప్పీళ్ల పరిష్కారం, 24న ఉపసంహరణ, తుది జాబితా ప్రకటన ఉంటుంది. నవంబర్ 29న పోలింగ్, ఓట్ల లెక్కింపు నిర్వహిస్తారు.

మూడో దశ: నవంబర్ 19న నోటిఫికేషన్ విడుదల చేసి, నవంబర్ 23 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 24న పరిశీలన, 25న అప్పీళ్లు, 26న అప్పీళ్ల పరిష్కారం, 27న ఉపసంహరణ, తుది జాబితా ప్రకటన ఉంటుంది. డిసెంబర్ 2న పోలింగ్, అవసరమైతే డిసెంబర్ 3న రీపోలింగ్ నిర్వహిస్తారు.

### నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు, మంత్రులు, ప్రభుత్వ ఉద్యోగులు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సూచించారు. కుల, మత, ప్రాంతీయ భావాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేయరాదని, ప్రచార సభలు, సమావేశాలు, లౌడ్‌స్పీకర్ల వినియోగానికి అనుమతులు తీసుకోవాలని తెలిపారు. రాత్రి 10 గంటల తర్వాత లౌడ్‌స్పీకర్ల వినియోగం నిషేధమని పేర్కొన్నారు. ప్రభుత్వ భవనాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, జాతీయ రహదారులు, ప్రైవేట్ ఆస్తులపై అనుమతి లేకుండా పోస్టర్లు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం పోర్టల్‌లో అందుబాటులో ఉన్న సేవలను అభ్యర్థులు, ఓటర్లు వినియోగించుకోవాలని సూచించారు. నామినేషన్ల దాఖలు, ఓటరు స్లిప్పుల డౌన్‌లోడ్, పోలింగ్ కేంద్రాల వివరాలను పోర్టల్‌లోని సదుపాయాల మేరకు తెలుసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు ఎన్నికల వ్యయ పరిమితులను పాటిస్తూ ప్రచార ఖర్చుల వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని సూచించారు. ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు, సమస్యలు ఉంటే 1800 425 4299 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయవచ్చని పేర్కొన్నారు.

### సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసుల నిఘా

జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలను గుర్తించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తులపై బైండ్ ఓవర్ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. జాయింట్ కార్డన్ సెర్చ్‌లు, ఫ్లయింగ్ స్క్వాడ్లు, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు పోలీసు బలగాలు, ప్రత్యేక స్ట్రైకింగ్ ఫోర్స్‌ను మోహరించి నిరంతర నిఘా కొనసాగిస్తామని చెప్పారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై పోలీసు, రెవెన్యూ శాఖల సంయుక్త బృందాలు స్పందిస్తాయని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

### ఏకగ్రీవ ఎన్నికలపై సమగ్ర విచారణ

స్థానిక సంస్థల ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ, అవసరమైన ధ్రువపత్రాలు, డిక్లరేషన్ల సమర్పణపై అభ్యర్థులకు అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అక్రమ ఏకగ్రీవ ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఆర్డీఓ ఆధ్వర్యంలో సమగ్ర విచారణ చేపడతామని వెల్లడించారు. ఈ సమావేశంలో కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు, జిల్లా పరిషత్ సీఈవో సుధాకర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ పాల్గొన్నారు.

# శ్రీశైలంలో వైభవంగా దసరా మహోత్సవాలు

## - స్కందమాత అలంకారంలో అమ్మవారు, శేషవాహనంపై స్వామిఅమ్మవార్ల సేవ

శ్రీశైలం, మహి న్యూస్, అక్టోబర్ 15 : శ్రీశైల దేవస్థానంలో దసరా నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన ఈ రోజు ఉదయం శ్రీశైల క్షేత్రంలో శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామివార్లకు ప్రాతఃకాల పూజలు, విశేష కుంకుమార్చనలు, నవావరణార్చనలు, జపానుష్ఠానాలు, పారాయణలు, సూర్య నమస్కారములు, చండీహోమం, పంచాక్షరి, భ్రామరి, బాలా జపానుష్ఠానములు, చండీపారాయణ, చతుర్వేద పారాయణలు మరియు కుమారీ పూజలు వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అదేవిధంగా రుద్రహోమం, రుద్రయాగాంగ జపములు, రుద్ర పారాయణలను శ్రద్ధగా జరిపించారు. సాయంకాల వేళలోనూ విశేష జపములు, పారాయణలు, నవావరణార్చన, కుంకుమార్చన, చండీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. రాత్రి 9.00 గంటల నుండి కాళరాత్రి పూజ, అమ్మవారి ఆస్థాన సేవ, సువాసినీ పూజలు వైభవంగా జరగనున్నాయి.

### భక్తిశ్రద్ధలతో కుమారీ పూజ

నవరాత్రి ఉత్సవాలలో అత్యంత ముఖ్యమైన సంప్రదాయంగా భావించే కుమారీ పూజను దేవస్థానంలో రోజువారీగా నిర్వహిస్తున్నారు. ఈ పూజలో రెండు సంవత్సరాల నుండి పది సంవత్సరాల వయస్సు కలిగిన బాలికలను ఆహ్వానించి, పూలు, పండ్లు, నూతన వస్త్రాలను సమర్పించి దేవీ స్వరూపాలుగా ఆరాధిస్తున్నారు.

### స్కందమాత అలంకారంలో దేవి దర్శనం:

నవరాత్రి మహోత్సవాల సందర్భంగా నిర్వహించే నవదుర్గ అలంకారాలలో భాగంగా 15 న అమ్మవారి ఉత్సవమూర్తిని 'స్కందమాత' స్వరూపంలో అలంకరించారు. చతుర్భుజాలతో, ఒక చేతిలో బాల స్కందుణ్ణి (కుమారస్వామి) పట్టుకుని, మిగిలిన చేతులలో పద్మాలు, అభయముద్రలు ధరించిన ఈ రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

స్కందమాతను ఉపాసించడం వల్ల స్కందదేవుని ఉపాసనా ఫలితంతో పాటు సకల కోరికలు నెరవేరి శాంతి సౌఖ్యాలు లభిస్తాయని విశ్వసిస్తారు.

### కన్నుల పండువగా శేషవాహన సేవ:

వాహనసేవలలో భాగంగా అక్టోబర్ 15 న శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను శేషవాహనంపై వేంచేపు చేసి విశేష పూజలు నిర్వహించనున్నారు. అత్యంత రమణీయంగా అలంకరించిన శేషవాహనంపై స్వామిఅమ్మవార్లు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

# అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలన, నమోదు కార్యక్రమం

## సిరివెళ్ల, ఓర్వకల్లు మండలాల బాధితులకు అవకాశం
## ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నమోదు




కర్నూలు, అక్టోబర్ 15: (మహి న్యూస్): అగ్రిగోల్డ్ బాధితుల బాండ్ల పరిశీలన, నమోదు కార్యక్రమాన్ని కర్నూలు ప్రాంతీయ సీఐడీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు అడిషనల్ ఎస్పీ ఎన్. పూజిత తెలిపారు. అక్టోబర్ 15, 17 తేదీల్లో నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం, కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలాలకు చెందిన బాధితుల బాండ్ల పరిశీలన, నమోదు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమం కర్నూలు నగరంలోని రామలింగేశ్వర నగర్‌లో, ఏపీ టూరిజం హోటల్ సమీపంలోని ప్రాంతీయ సీఐడీ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుంది. సంబంధిత అగ్రిగోల్డ్ బాధితులు అవసరమైన పత్రాలతో హాజరై తమ బాండ్లను పరిశీలించుకుని నమోదు చేయించుకోవాలని ఎన్. పూజిత కోరారు.

# భక్తుల సేవలో.. కలెక్టర్ నిరంతర పర్యవేక్షణ..



విజయవాడ, మహి న్యూస్, అక్టోబర్ 15 : దసరా ఉత్సవాల్లో 5వరోజు -జగన్మాత శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిస్తుండగా ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ కొనసాగుతుంది. అన్ని క్యూ లైన్లలో భక్తులు తరలివెళ్తూ అమ్మ దర్శనం చేసుకుంటున్నారు. మరోవైపు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో క్యూలైన్లను పరిశీలిస్తుండటంతో పాటు కొండ దిగువన గల సమీకృత కమాండ్ కంట్రోల్ కేంద్రం (ఐసీసీసీ) నుంచి పరిస్థితులను తెలుసుకుంటున్నారు. సమన్వయ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. రద్దీ నియంత్రణ, వీవీఐపీ, వీఐపీ వాహనాల రాకపోకలు, క్రౌడ్ మేనేజ్‌మెంట్, శాంతిభద్రతల పరిరక్షణ.. ఇలా ప్రతి విషయంలోనూ సీసీసీ ఉత్సవాల నిర్వహణలో కీలకంగా నిలుస్తోంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన సీసీటీవీలు, డ్రోన్ల విజువల్స్‌ను నిరంతరం పరిశీలిస్తూ ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉత్సవాల విజయవంతానికి సీసీసీ సిబ్బంది కృషిచేస్తున్నారు. ఆధునిక కెమెరాల డేటాను కూడా ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ వాహనాల ఎంట్రీ, ఎగ్జిట్‌ను నిశితంగా పరిశీలిస్తూ ఘాట్ రోడ్డుపై ట్రాఫిక్ జామ్ కాకుండా, నిబంధనల ఉల్లంఘనల జరక్కుండా చూస్తున్నారు.

# దసరా శరన్నవరాత్రులు - 2026: వైభవంగా శ్రీ దుర్గా మల్లేశ్వరుల ఐదవ రోజు దివ్య నగరోత్సవం

ఇంద్రకీలాద్రి, మహి న్యూస్, అక్టోబర్ 15: శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత భక్తిప్రపత్తులతో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో ఐదవ రోజైన గురువారం సాయంత్రం ఆదిదంపతులైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల పవిత్ర నగరోత్సవం నయనానందకరంగా, ఆధ్యాత్మిక శోభతో వైభవంగా జరిగింది. ఇంద్రకీలాద్రి శిఖరాన జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారు త్రిపురత్రయ పూజిత, సర్వసౌభాగ్యప్రదాయిని అయిన శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి దివ్యాలంకారంలో భక్తులకు దర్శనమిస్తుండగా, పరమ పవిత్రమైన ప్రదోషకాల సమయంలో కొండపై కొలువుదీరిన శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులకు అర్చక బృందం శాస్త్రోక్తంగా విశేష పూజలు, పంచహారతులు నిర్వహించారు. అనంతరం దేవస్థాన కార్యనిర్వహణాధికారి వి.కె.




శీనా నాయక్ సంప్రదాయబద్ధంగా కొబ్బరికాయ కొట్టి నగరోత్సవ రథయాత్రను ప్రారంభించి, స్వయంగా రథోత్సవంలో పాల్గొన్నారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలతో నగరోత్సవ రథం ముందుకు సాగుతుండగా సుమధుర శాక్సోఫోన్ వాయిద్యాలు, కేరళ సంప్రదాయ పంచవాద్యాల దరువులు, తమిళ సంప్రదాయ నయాండీ మేళం దరువులతో పాటు మహిళా భక్తుల లయాన్విత కోలాటాలు భక్తులను పరవశింపజేశాయి. ఈ వాద్య-నృత్య విన్యాసాలు ఊరేగింపులో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దేవస్థానం నుండి ప్రారంభమైన దివ్య రథయాత్ర రథం కొండపైకి చేరుకుంది. ?భక్తజన నీరాజనాలు: విద్యుద్దీపాలు, సుగంధ పుష్పమాలికలతో సర్వాంగసుందరంగా అలంకరించిన రథంపై అధిష్టించిన ఆదిదంపతులను దర్శించుకునేందుకు పురవీధుల్లో వేలాది మంది భక్తులు బారులు తీరారు. మార్గమధ్యంలో భక్తులు కొబ్బరికాయలు సమర్పిస్తూ, ధూపదీప కర్పూర నీరాజనాలతో స్వామి, అమ్మవార్లను కీర్తిస్తూ భక్తిప్రపత్తులు చాటుకున్నారు. ఊరేగింపు ఘనంగా ఇంద్రకీలాద్రి పైకి చేరుకున్న అనంతరం ఆలయ రాజగోపురం ముంగిట పల్లకీ నిలిపి, ఆలయ స్థానాచార్యుల ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు, దివ్య మంగళ హారతులతో ఆస్థానం కార్యక్రమం నిర్వహించారు. నవరాత్రుల వేళ లలితా త్రిపుర సుందరీ దేవి అలంకార శోభలో కొలువుదీరిన ఆదిదంపతులను రథారూఢులుగా దర్శించుకోవడం వల్ల సకల మనోభీష్టాలు నెరవేరుతాయని, కుటుంబంలో సౌభాగ్యం, శాంతి చేకూరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ మహోత్సవంలో దేవస్థాన సిబ్బంది మరియు అశేష భక్తజనం పాల్గొని శ్రీ దుర్గా మల్లేశ్వరుల కృపాకటాక్షాలను పొందారు.

## మున్సిపల్ ఎన్నికల స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాల పరిశీలన..!

### భద్రతా ఏర్పాట్లపై అధికారులకు జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా సూచనలు



కడప, మహి న్యూస్ అక్టోబర్ 15 : మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా కడపలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం (ఎం ఎ ఎన్ యు యు) పాలిటెక్నిక్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన మూడు స్ట్రాంగ్ రూమ్‌లు, మూడు ఓట్ల లెక్కింపు కేంద్రాలను పరిశీలించి, ఎన్నికల సామగ్రి భద్రత, కేంద్రాల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా జరిగేలా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో జేసితో పాటు కడప నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం, కడప డీఎస్పీ టి. భవానీ పాల్గొని భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, నిబంధనల ప్రకారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులు సూచించారు.



## నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను పరిశీలించిన కేఎంసి కమిషనర్



కడప, మహి న్యూస్ అక్టోబర్ 14: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు చేపట్టిన ఏర్పాట్లను గురువారం కడప నగరపాలక సంస్థ (కేఎంసి) కమిషనర్ డా. పి. భవానీ ప్రసాద్ రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కడప నగరపాలక పరిధిలో ఏర్పాటు చేసిన పలు నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద చేసిన ఏర్పాట్లను పరిశీలించి, ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగేలా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఆదేశించారు.





## లౌకిక ప్రజాస్వామ్యంలో ప్రతిదానికీ మతాన్ని ముడిపెట్టడం బాధాకరం : జీవానందం



రాయచోటి, మహిన్యూస్, అక్టోబర్ 15: లౌకిక ప్రజాస్వామ్య దేశంలో ప్రతి అంశాన్ని మతం కోణంలో చూడటం బాధాకరమని ఏపీ మేధావుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ కె. జీవానందం అన్నారు. గురువారం రాయచోటిలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆప్ కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాషా ఆధ్వర్యంలో రూపొందించిన 'ఆప్ కీ ఆవాజ్' పుస్తకాన్ని జీవానందం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుస్తకంలో ముస్లిం మైనారిటీల ప్రస్తుత స్థితిగతులు, దేశవ్యాప్తంగా వారు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై ప్రజాస్వామికవాదులు, సామాజిక కార్యకర్తలు, మేధావుల అభిప్రాయాలను సేకరించి పొందుపరిచినట్లు తెలిపారు. మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమాజంలో విస్తృత చర్చకు ఈ పుస్తకం దోహదపడుతుందని, ప్రజాస్వామిక విలువలు, సామాజిక సమానత్వం, మతసామరస్యంపై చర్చించేందుకు ఒక వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాస్ రాష్ట్ర కార్యదర్శి తాతయ్య, ఏపీ వడ్డెర విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యదర్శి మారుతి శంకర్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు యుగంధర్, ఏఐసీసీ జిల్లా సీనియర్ నాయకుడు అజ్మతుల్లా, అన్వర్ బాషా, జిల్లా రజక సంఘం అధ్యక్షుడు రమేష్ బాబు, రమణతో పాటు వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధులపై పూర్తి అవగాహనతో బాధ్యతలు నిర్వర్తించాలి..!

### ఆర్ఓలు, ఏఆర్ఓలు, ప్రిసైడింగ్ అధికారులకు జేసీ డా. నిధి మీనా సూచనలు



కడప, మహి న్యూస్ అక్టోబర్ 15: ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నిబంధనలు, మార్గదర్శకాలపై పూర్తి అవగాహన పెంచుకుని, తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా అధికారులకు సూచించారు. గురువారం కడప కలెక్టరేట్‌లోని సభా భవనంలో ఎన్నికల విధుల నిర్వహణపై రిటర్నింగ్ అధికారులు (ఆర్ఓలు), సహాయ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్ఓలు), ప్రిసైడింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జేసితో పాటు రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, కడప ఆర్డీవో మురళీ, డిప్యూటీ కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల మార్గదర్శకాల పుస్తకాలను అందజేసి, ఎన్నికల నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలు, అధికారుల విధులు, బాధ్యతలను జేసీ వివరించారు. ఎన్నికల విధులకు సంబంధించి అధికారులకు ఎదురయ్యే సందేహాలను అడిగి తెలుసుకుని, వాటిని నివృత్తి చేశారు. ఎన్నికల ప్రక్రియలో ప్రతి అధికారి తన పాత్రను స్పష్టంగా అర్థం చేసుకుని, నిబంధనల ప్రకారం విధులు నిర్వర్తించాలని సూచించారు. ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సమన్వయంతో పనిచేయాలని, విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకూడదని ఆదేశించారు.



## స్థానిక సంస్థల ఎన్నికలపై టీడీపీ నాయకుల సమావేశం

### ఎన్నికలకు సమాయత్తం కావాలని నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం



కడప జిల్లా/జమ్మలమడుగు, మహి న్యూస్, అక్టోబర్ 15:: జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కడప జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ పార్టీ పరిశీలకురాలు రామసుబ్బమ్మ పాల్గొని నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాల్సిన అంశాలపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఉపాధ్యక్షుడు మల్లికార్జునతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం..!

### జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లా ఎస్పీ, జేసీ, డిఆర్వో లతో కలిసి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మీడియా సమావేశం



కడప మహి న్యూస్ అక్టోబర్ 15 : రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ ఈ సి) జారీ చేసిన షెడ్యూల్‌ను ఆధారంగా చేసుకుని వైఎస్ఆర్ కడప జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనట్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి తెలిపారు. గురువారం సాయంత్రం కడప కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి... స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జేసీ డా. నిధీమీనా, డిఆర్వో మల్లికార్జునుడు లతో కలిసి... మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన విధివిధానాలను జిల్లా కలెక్టర్ సమగ్రంగా వివరించారు. జిల్లాలో ఉన్న 9 అర్బన్ లోకల్ బాడీలు (యు ఎల్ బి ఎస్), జిల్లా పరిషత్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ అలాగే సర్పంచ్ స్థానాల ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలోని 8 మున్సిపాలిటీలు మరియు 1 మున్సిపల్ కార్పొరేషన్‌లో రేపటి నుంచి అధికారికంగా ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందన్నారు. ఎన్నికలకు ముందస్తుగా చేపట్టాల్సిన ప్రీ-పోలింగ్ ప్రక్రియ అంతా జిల్లా స్థాయిలో విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఓటర్ల జాబితా ప్రచురణ, ఓటర్ల రోల్స్, పోలింగ్ స్టేషన్ల గుర్తింపు, సున్నిత మరియు అతి సున్నిత పోలింగ్ కేంద్రాల వర్గీకరణ, అలాగే అవసరమైన మాన్‌పవర్ (సిబ్బంది) కేటాయింపు ప్రక్రియలను పూర్తి చేసుకున్నట్లు వివరించారు. అలాగే మున్సిపాలిటీల వారీగా వార్డులవారీ రిజర్వేషన్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ మరియు ఎంపీపీ రిజర్వేషన్లను ఇప్పటికే గెజిట్ ద్వారా ప్రకటించడం జరిగిందని కలెక్టర్ వెల్లడించారు. జిల్లా అడ్మినిస్ట్రేషన్ పూర్తిగా సన్నద్ధంగా ఉందని, మున్సిపల్ స్థాయి యంత్రాంగం కూడా ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు సర్వసద్ధం చేసినట్లు చెప్పారు. అభ్యర్థులు ఎటువంటి భయాలకు తావులేకుండా స్వేచ్ఛాయుత మరియు నిష్పక్షపాత (ఫ్రీ అండ్ ఫైర్) వాతావరణంలో ఎన్నికలు జరిగేలా జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ భరోసానిచ్చారు. ప్రస్తుతం ఎలక్టోరల్ రోల్స్ అప్‌డేటెడ్ జాబితాలు అందుబాటులోకి వచ్చాయని, నేడు సాయంత్రానికి ఆ అప్‌డేటెడ్ రోల్స్‌ను సంబంధిత మున్సిపల్ కమిషనర్లకు అందజేయడం జరుగుతుందని, ఓటర్లు తమ పేర్లు ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఏదైనా సమస్య తలెత్తితే ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను లేదా ప్రత్యేక సెల్‌ను ఆశ్రయించవచ్చని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం అందించిన వెబ్‌సైట్ ద్వారా కూడా తగిన సమాచారాన్ని పొందవచ్చన్నారు.

### కుల ధృవీకరణ పత్రాలు మరియు నోడ్యూస్ సర్టిఫికెట్లపై ప్రత్యేక ఆదేశాలు:

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కుల ధృవీకరణ పత్రాల కోసం మీ-సేవా కేంద్రాల ద్వారా లేదా వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఒకవేళ భౌతికంగా అప్లికేషన్లు పెట్టుకున్నట్లయితే, ఆ సమాచారాన్ని తమకు తెలియజేస్తే కేవలం 24 గంటల్లోనే ధృవీకరణ పత్రాలు అందేలా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. అలాగే పంచాయతీ లేదా అర్బన్ లోకల్ బాడీల పరిధిలో ఎవరైనా 'నోడ్యూస్ సర్టిఫికెట్' (నో డ్యూ సర్టిఫికెట్) కోరితే వెంటనే జారీ చేసేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నామని, ఏవైనా ఇబ్బందులు ఎదురైతే జిల్లా ఎన్నికల అధికారులను లేదా ప్రత్యేక సెల్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. ఈ ఎన్నికలను విజయవంతం చేయడానికి పోటీ చేసే అభ్యర్థులు, ఓటర్లు అందరూ నిబంధనలకు కట్టుబడి అధికారులకు పూర్తిగా సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఆర్వోలు, ఏఆర్వోలకు ఇప్పటికే తగిన శిక్షణ ఇవ్వడం జరిగిందని, శిక్షణ మరియు సమీక్షా సమావేశాల ద్వారా ఎన్నికల ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకువెళ్తున్నట్లు తెలిపారు.

## ఆధార్ కావాలంటే అవస్థలు పడాల్సిందేనా?

### ఆధార్ కోసం అష్టకష్టాలు.. గంటల తరబడి చెట్ల కింద ప్రజల నిరీక్షణ సకాలంలో అందని ఆధార్ సేవలు

గాలివీడు:అక్టోబర్15(మహి న్యూస్ ): గాలివీడు మండల కేంద్రంలో ఆధార్ కార్డుల కొత్త నమోదులు మరియు సవరణల కోసం వస్తున్న సామాన్యులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఆధార్ సేవలు పూర్తిగా అస్తవ్యస్తంగా మారడంతో ప్రజలు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. మండల కేంద్రంలోని పోస్ట్ ఆఫీసులో నిర్వహిస్తున్న ఏకైక ఆధార్ కేంద్రం వద్ద సిబ్బంది తీరుతో ప్రజలు ముప్పతిప్పలు ఎదుర్కొంటున్నారు. పని దినాలలోనూ సిబ్బంది ఎప్పుడు అందుబాటులో ఉంటారో తెలియకపోవడం, ఒకవేళ కార్యాలయానికి వచ్చినా కేవలం కొద్ది గంటలు మాత్రమే సేవలు అందించి వెళ్లిపోతుండటంతో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.?కొత్త ఆధార్ కార్డుల నమోదు కోసం, అలాగే పేరు, పుట్టిన తేదీ, అడ్రస్, మొబైల్ నంబర్ వంటి మార్పులు చేర్పుల కోసం వస్తున్న వారికి పనులు పూర్తి కావడానికి ఏకంగా 4 నుండి 5 రోజులుగా తిప్పుతుండటంతో వారి నిత్య జీవితం, కూలీ పనులు దెబ్బతింటున్నాయి. గతంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో కొన్ని రోజులు ఆధార్ కేంద్రం సేవలు అందించగా, ప్రస్తుతం అక్కడి నుండి ఆ సేవలు పూర్తిగా నిష్క్రమించాయి. దీంతో ఉన్న ఒక్క పోస్ట్ ఆఫీస్ కేంద్రంపైనే మండలంలోని అన్ని గ్రామాల ప్రజల భారం పడింది.

### ఉదయం నుండి సాయంత్రం వరకు పడిగాపులే...

ఆధార్ సేవలు కోసం ఉదయమే తమ పనులను మానుకుని సుదూర గ్రామాల నుండి మండల కేంద్రానికి వస్తున్నా ఆధార్ తీసే సిబ్బంది లేక సాయంత్రం వరకు పోస్ట్ ఆఫీసు కార్యాలయం చెట్ల క్రింద గంటల తరబడి వృద్ధులు,పిల్లల తల్లిదండ్రులు పడిగాపులు కాస్తున్నారు. తిండి, నీళ్లు లేక నానా అవస్థలు పడుతూ చివరికి ఏ పనులు కాకుండానే ఉసూరుమని వెనుదిరుగుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మరియు ప్రజాప్రతినిధులు స్పందించి, మండల ప్రజలు పడుతున్న కష్టాలను క్షేత్రస్థాయిలో గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం ఉన్న కేంద్రంతో పాటు మండలంలో మరో అదనపు ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, సేవలను నిరంతరం అందుబాటులోకి తీసుకురావాలని తగు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లు ముమ్మరం

### పోలింగ్ కేంద్రాల్లో వసతులపై క్షేత్రస్థాయి తనిఖీలు పారదర్శకంగా సిబ్బంది కేటాయింపు.. ఎన్నికల ఫిర్యాదుల పర్యవేక్షణకు ప్రత్యేక నియంత్రణ గది

కడప జిల్లా । మహి న్యూస్ । అక్టోబర్15: జిల్లాలో రానున్న ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ప్రాథమిక ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ డా. నిధీ మీనా తెలిపారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన చర్యలను వేగవంతం చేసినట్లు వెల్లడించారు.

### ఓటర్ల జాబితా ప్రచురణ..

### పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఇప్పటికే ఓటర్ల జాబితాను ప్రచురించడంతో పాటు పోలింగ్ కేంద్రాలను ఖరారు చేసినట్లు జేసీ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్ సౌకర్యం, ఇతర మౌలిక వసతులు ఉన్నాయా లేదా అనే అంశంపై క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వీడియో చిత్రీకరణ ఏర్పాట్లు పూర్తయ్యాయని, అంతర్జాల ప్రత్యక్ష ప్రసారానికి సంబంధించిన తుది ఏర్పాట్లు కొనసాగుతున్నాయని వివరించారు. కీలక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేకంగా ఈ ఏర్పాట్లు చేపడుతున్నట్లు తెలిపారు. వీటితో పాటు నిఘా కెమెరాల ఏర్పాట్లను కూడా పటిష్టం చేస్తున్నట్లు వెల్లడించారు.

### యాదృచ్ఛిక పద్ధతిలో సిబ్బంది కేటాయింపు

ఎన్నికల విధుల నిర్వహణకు అవసరమైన సిబ్బంది వివరాల సమాహారం సిద్ధంగా ఉందని జేసీ తెలిపారు. ఈసారి నూతనంగా సిబ్బంది కేటాయింపు సాఫ్ట్‌వేర్‌ను వినియోగిస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా ప్రతి పోలింగ్ కేంద్రానికి సిబ్బందిని యాదృచ్ఛిక పద్ధతిలో కేటాయిస్తామని, విధులు కేటాయించిన పోలింగ్ కేంద్రం వివరాలు సిబ్బందికి ముందుగానే తెలియకుండా పారదర్శక విధానాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈ ప్రక్రియను జిల్లా సమాచార అధికారి, జాతీయ సమాచార కేంద్రం పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



### సిబ్బందికి త్వరలో శిక్షణ

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఇప్పటికే శిక్షణ పూర్తయిందని జేసీ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల సిబ్బందికి త్వరలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రానున్న మూడు, నాలుగు రోజుల్లో ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, ఇతర సిబ్బందికి శిక్షణ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

### కౌంటింగ్ కేంద్రాలు ఖరారు

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రాలను కూడా ఖరారు చేసినట్లు జేసీ తెలిపారు. కడపలోని మౌలానా ఆజాద్ ఉర్దూ విశ్వవిద్యాలయం, ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, మైదుకూరు మున్సిపల్ కౌన్సిల్ హాల్, జమ్మలమడుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎర్రగుంట్ల, కమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, పులివెందుల జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల, బద్వేల్ బీఆర్ అంబేద్కర్ గురుకులం, రాజంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ఇతర కేంద్రాలను ఎంపిక చేసినట్లు వివరించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో అవసరమైన గదులు, ఇతర ఏర్పాట్లను ఖరారు చేసినట్లు తెలిపారు.

### ఫిర్యాదుల పర్యవేక్షణకు నియంత్రణ గది

ఎన్నికల విధుల నిర్వహణలో అధికారులకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించామని జేసీ పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను పర్యవేక్షించేందుకు జిల్లాలో ప్రత్యేక నియంత్రణ గదిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, బాధ్యతాయుతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్లు డా. నిధీ మీనా వెల్లడించారు.

## జగన్మాత సన్నిధిలో సాంస్కృతిక వైభవం

### ఆధ్యాత్మిక తరంగాలతో పులకించిన కళావేదిక

ఇంద్రకీలాద్రి, మహి న్యూస్, అక్టోబర్ 15 : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో అత్యంత వైభవోపేతంగా జరుగుతున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా శ్రీ కనకదుర్గా నగర్‌లోని ప్రత్యేక కళావేదికపై గురువారం సాంస్కృతిక, ఆధ్యాత్మిక శోభ పరిపూర్ణంగా వెల్లివిరిసింది. ?సమస్త బ్రహ్మాండ భాండజనని, శ్రీచక్ర నివాసిని అయిన జగన్మాత శ్రీ కనకదుర్గ అమ్మవారు ఇంద్రకీలాద్రి శిఖరాన సర్వాభీష్టప్రదాయిని శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి దివ్యాలంకారంలో భక్తులకు కరుణామృత దృష్టితో దర్శనమిస్తుండగా, కొండదిగువన కనకదుర్గా నగర్ ప్రాంగణమంతా దుర్గా నామస్మరణతో, భక్తి ప్రవచనాలతో పులకించిపోయింది. "నాదతనుమనిశం శంకరం" అన్నట్లుగా సంగీతం, నాట్యం ద్వారా పరదేవతను ఆరాధించే దివ్య సంకల్పంతో కళాకారులు సమర్పించిన కళార్చనలు అమ్మవారి దర్శనార్థం తరలివచ్చిన లక్షలాది భక్తజనాన్ని ఆధ్యాత్మిక తన్మయత్వంలో ఓలలాడించాయి. ఉదయం నుండి రాత్రి వరకు నిర్విరామంగా సాగిన ఈ ప్రదర్శనలు క్షేత్రంలో దివ్యమైన ఆధ్యాత్మిక ప్రకంపనలను సృష్టించాయి.

### ఆధ్యాత్మిక నాదార్చన:

భి. సువర్ణకుమారి బృందం సమర్పించిన సాంప్రదాయ తాళం భజనతో కళావేదిక ఆధ్యాత్మిక చైతన్యంతో ప్రారంభమైంది.

?జగన్మాత దివ్య లీలలను, శ్రీ లలితా సహస్రనామ వైభవాన్ని కీర్తిస్తూ జి. నాగేశ్వర శర్మ, పి.హెచ్.ఎస్. మణికంఠ, ఎం. నాగ సునీత, పి.వి.ఎన్. కామేశ్వరి ఆలపించిన భక్తిరంజని సంకీర్తనలు, దేవీ స్తోత్రాలు భక్తులను నాదబ్రహ్మంలో తేలియాడేలా చేశాయి.

?హరికథా భాగవతార్ జె. సుధాకర్ సమర్పించిన హరికథా కాలక్షేపం భక్తులను భక్తిరసంలో ముంచెత్తింది. జగన్మాత త్రిపుర సుందరీ అవతార విశిష్టతను వివరిస్తూ ప్రధాన కథగా భక్త మార్కండేయుని చరిత్ర సుమధుర గానం, అభినయంతో రంగరించి వివరించిన తీరు భక్తులను మంత్రముగ్ధులను చేసింది.

### దివ్య నృత్య నీరాజనం -- శాస్త్రీయ నాట్యార్చన:

శ్రీ లలితా పరమేశ్వరిని ప్రసన్నం చేసుకునే భావంతో చిన్నారులు, యువ కళాకారులు లయాన్విత ముద్రలు, సాత్విక అభినయంతో కూచిపూడి, భరతనాట్య రీతులలో నాట్యార్చన గావించారు.



డి. పావని, జి. విజయ గౌరి, టి.పి. లావణ్య, ఎస్.కె.వి.ఎన్. శాస్త్రి

ఎం. కీర్తన, కె. శ్రీనివాస్, జి. చాముండి చౌదరి, జి. పావని

వి. మనోజ్ఞ కామేశ్వరి, డి. సాయి లిక్షిత శ్రీ, పి. పూజశ్రీ, డాక్టర్ కె. వరప్రసాద్

యు. వెంకట రామకృష్ణ, పి. గౌరీశ్వర రావు, వై. రాణి, బి.వి.కె.ఎస్. శ్రీకరి, వై. భానుశ్రీ శరిణి

ఈ కళాకారులు ప్రదర్శించిన దేవీ స్తుతులు, మహిషాసుర మర్దిని స్తోత్ర నాట్యాలు, శివతాండవ రూపకాలు సభికులను ఆధ్యాత్మిక ఆనందడోలికల్లో తేల్చాయి. వేదిక ముంగిట వేచి ఉన్న భక్తులు ఈ ప్రదర్శనలను తిలకిస్తూ ఆధ్యాత్మిక అనుభూతిని పొందారు. లలితా త్రిపుర సుందరి పాదపద్మాలకు కళారూపాలతో నీరాజనం పలికిన కళాకారులందరినీ దేవస్థాన అధికారులు ప్రశంసించి, శ్రీ అమ్మవారి శేషవస్త్రాలు, పవిత్ర ప్రసాదాలు అందజేసి ఘనంగా సత్కరించారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPA DIST, A.P
PRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com